తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | సంపుటి: 2 | సంచిక: 210 | శనివారం 21–12–2024 | పేజీలు: 08 | వెల: 5 | www.telanganamuchatlu.in

# ఫార్ములా ఈ కార్ రేసుపై ఎప్పుడైనా ఎక్కడైనా చర్చకు సిద్ధం

- ఏసీబీ విచారణలో ఉన్నందునా ఇప్పుడు పూర్తి వివరాలు చెప్పలేను
- ఈ-ఫార్ములా సంస్థతో జరిగిన కేటీఆర్ లోపాయికారీ ఒప్పందం అంతా ప్రజల ముందు పెడతా
- వెంటనే విచారణ జరపాలని అధికారులకు సూచించా
- ఈ-కార్ రేస్ అగ్రిమెంట్ రూ.55 కోట్లు కాదు.. రూ.600 కోట్లు
- రూ.55 కోట్ల దగ్గరే వాళ్లను పట్టుకున్నాం సీఎం రేవంత్‌రెడ్డి.



హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:

ఈఫార్ములా సంస్థతో జరిగిన కేటీఆర్ లోపాయికారీ ఒప్పందం అంతా ప్రజల ముందు పెడతానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అసెంబ్లీలో కేటీఆర్ ఈఫార్ములా కేసుపై సీఎం మాట్లాడుతూ.. బీఆర్ఎస్ బీఏసీ మీటింగ్‌లో 9 అంశాలు ఇచ్చారు.. దీంట్లో ఈ ఫార్ములా గురించి ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. ఈ ఫార్ములా ప్రతినిధి తనను కలిశారని.. ఎవరు వచ్చినా అందరినీ కలుస్తానని చెప్పారు. ఈ ఫార్ములా ప్రతినిధిని తన ఇంట్లో కలిశానని అన్నారు. తనకేం సంబంధం అని అడిగానన్నారు. కేటీఆర్‌తో అంత సెటిల్ చేసుకున్నానని ఫార్ములా ప్రతినిధి అన్నారు.. అధికారులతో మాట్లాడి చెప్తా అన్నానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈకార్ రేస్ ప్రతినిధి తనను కలవడంతోనే ఈ బండారం బయటపడిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.ఏసీబీ విచారణలో ఉన్నందునా ఇప్పుడు పూర్తి వివరాలు చెప్పలేనని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఇక్కడ తానేం చెప్పినా కోర్టుకు వెళ్లి...సీఎం తన మీద కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని కోర్టుకు చెప్పుకుందాం అనుకుంటున్నారని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ఫార్ములా సంస్థతో జరిగిన కేటీఆర్ లోపాయికారీ ఒప్పందం అంతా ప్రజల ముందు పెడతానని పేర్కొన్నారు. వెంటనే విచారణ జరపాలని.. అధికారులకు సూచించానన్నారు. ఇప్పటి వరకు నాలుగు సార్లు సభ జరిగింది.. కానీ దీని గురించి చర్చకి అడగలేదని అన్నారు. ట్విట్టర్ పిట్ట ఇన్నాళ్లు ఎక్కడ పోయాడు.. బీఆర్ఎస్ వాళ్లకు మెదడు కూడా పోయినట్టు ఉందని సీఎం దుయ్యబట్టారు. ఎక్కడికైనా

మిగతా 2లో



# రణరంగంగా మారిన తెలంగాణ శాసనసభ..

- శాసనసభలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఆందోళన.. స్పీకర్ పోడియం వైపు దూసుకెళ్లే ప్రయత్నం
- స్పీకర్ పైకి పేపర్లు విసిరి వెల్ లోకి దూసుకొచ్చి బిఆర్ఎస్ రచ్చ
- ఫార్మ్లలా ఈ రేసుపై అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్
- సభ నుంచి వాకౌట్ ,స్పీకర్ పట్ల కూడా దారుణంగా వ్యవహరించారని సీఎం ధ్వజం

హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:

తెలంగాణ శాసనసభలో భూభారతి బిల్లు చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఫార్ములాఈ కేసు అసెంబ్లీని కుదిపేసింది. ఉభయసభల్లోనూ బీఆర్ఎస్ సభ్యులు చర్చకు డిమాండ్ చేయడంతో గందరగోళం నెలకొంది. అసెంబ్లీకి నల్ల బ్యాడ్జీలతో హాజరైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, గ్యారెంటీలపై ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారని నినాదాలు చేశారు. ఫార్మలా ఈ రేసుపై అసెంబ్లీలో చర్చించాలని లేకుంటే సభ జరగనివ్వమన్నారు. సభలో సమాధానం చెప్పేందుకు కేటీఆర్ సిద్ధమని తెలిపారు. ఫార్ములా ఈరేస్ కేసు అంశం ఒక వ్యక్తికి సంబంధించిన అంశమని, బిల్లు అనేది రాష్ట్ర ప్రజలకు సంబంధించిన అంశమని స్పీకర్ పేర్కొన్నారు.అయినప్పటికీ చర్చించాల్సిందేనని బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఆందోళన చేపట్టారు. ఫార్మలా ఈ అసెంబ్లీలో చర్చించటానికి ప్రభుత్వానికి భయమెందుకని నిలదీశారు. స్పీకర్ పార్టీ నేతగా వ్యవహరించొద్దని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో భూ భారతి బిల్లుపై

మిగతా 2లో

# హైకోర్టులో కేటీఆర్‌కు ఊరట..

- హైకోర్టులో కేటీఆర్‌కు ఊరట
- ఈ నెల 30వ తేదీ వరకు అరెస్ట్ చేయొద్దని ఏసీబీకి ఆదేశం
- తదుపరి విచారణ ఈనెల 27కు వాయిదా.




హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:

హైకోర్టులో కేటీఆర్‌కు ఊరట లభించింది. పదిరోజులు(ఈనెల 30) వరకు కేటీఆర్‌ను అరెస్ట్ చేయొద్దని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. కేటీఆర్ కేసులో విచారణ జరపాలని ఆదేశించింది. అలాగే.. విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది. కాగా.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. ఫార్ములాఈ రేసు విషయంలో ఏసీబీ కేసును వ్యతిరేకిస్తూ క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా ఈరోజు విచారణ జరిపిన న్యాయస్థానం ఈ తీర్పు వెల్లడించింది.

హైకోర్టులో కేటీఆర్ కేసు విచారణ వాడీవేడిగా జరిగింది. కేటీఆర్ తరపు లాయర్, ప్రభుత్వ తరపు లాయర్ మధ్య ప్రశ్నోత్తరాలు కొనసాగాయి. ఈ క్రమంలో.. కేటీఆర్‌ను అరెస్ట్ చేయకుండా ఏసీబీని ఆదేశించండని కోర్టుకు కేటీఆర్ లాయర్ తెలిపారు. ఈ కేసులో ఎలాంటి చర్యలు తీసుకోకుండా స్టే ఇవ్వండని కోరారు. మరోవైపు.. అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వాదిస్తూ.. ఎఫ్ఐఆర్ ద్వారానే దర్యాప్తు జరుగుతుంది.. ప్రతి విషయం ఎఫ్ఐఆర్ లో ఉండదని అన్నారు. దర్యాప్తులో అనేక విషయాలు బహిర్గతమవుతాయని తెలిపారు. ప్రాథమిక విచారణ జరిగాకే కేసు నమోదైంది.. రెండు నెలల క్రితం చీఫ్ సెక్రటరీ దాన కిషోర్ ఫిర్యాదు చేశారు.. విచారణకు గవర్నర్ కూడా అనుమతించారని ప్రభుత్వ తరపు లాయర్ పేర్కొన్నారు. దానికి సంబంధించిన పేపర్లు ఉన్నాయా అని

మిగతా 2లో



# సంగారెడ్డి జైలు నుంచి విడుదలైన లగచర్ల రైతులు..

- సంగారెడ్డి సెంట్రల్ జైలు నుంచి విడుదలైన 17 మంది లగచర్ల రైతులు..
- జైలులోనే A2 సురేష్ తో సహా ఏడు మంది

హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:

వికారాబాద్ జిల్లా లగచర్ల ఘటన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. సంగారెడ్డి జైలులో 37 రోజుల పాటు

మిగతా 2లో



# అప్పులపై తప్పుదోవ పట్టించారు

- మీరిచ్చిన లెక్కలతోనే ఆర్‌బీఐ నివేదిక ఇచ్చింది
- సభా హక్కుల ఉల్లంఘన నోటీసు మేం కదా ఇవ్వాలి?
- రుణాలపై చర్చలో హరీశ్‌రావుపై ఉప ముఖ్యమంత్రి భట్టి ఆగ్రహం

మిగతా 2లో



# భూభారతి బిల్లుకు శాసనసభ ఆమోదం

- రాష్ట్రంలో ప్రతి సమస్య భూమితోనే ముడిపడి ఉందన్న సీఎం -
- ధరణి వల్ల రైతులతో పాటు ప్రజాప్రతినిధులు కూడా బాధలు పడ్డారన్న రేవంత్ రెడ్డి

హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:

రాష్ట్రంలో ప్రతి సమస్య భూమితోనే ముడిపడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 'భూ భారతి' బిల్లుపై అసెంబ్లీలో చర్చలో భాగంగా రేవంత్ రెడ్డి మాట్లాడారు. రావి నారాయణ, బద్దం ఎల్లారెడ్డి, మల్లు స్వరాజ్యం వంటి వారు భూపోరాటాలు చేశారన్నారు. తెలంగాణలో ప్రజల

మిగతా 2లో



02

# రాహుల్ గాంధీపై విమర్శలు

- పార్లమెంట్‌లో చోటుచేసుకున్న సంఘటనలో
- గాయపడ్డ ఎంపీలు ప్రతాప్ సారంగి, ముఖేష్ రాజపుత్‌లను
- పరామర్శించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్, బండి సంజయ్.
- రాహుల్ గాంధీపై విమర్శలు

# ఫార్ములా ఈ కార్ రేస్ అంశంపై అసెంబ్లీలో రచ్చ..

- అసెంబ్లీలో ఎమ్మెల్యేపై అక్రమ కేసు పెట్టారని సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శ..
- తప్పు చేశామని, సభలో చర్చించి చెప్పాలని డిమాండ్..



హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:

బీఆర్ఎస్ ఎమ్మెల్యేపై అక్రమ కేసు పెట్టారని అసెంబ్లీలో సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శించారు. కేటీఆర్‌ను అప్రతిష్టపాలు చేసి బీఆర్ఎస్‌ను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని తెలిపారు. ఫార్ములాఇ కార్ రేస్ అంశంపై స్పీకర్ ఛాంబర్‌లో కలిసి విజ్ఞప్తి చేశామన్నారు. ఫార్ములాఇ కార్ రేస్ సమస్యకు సంబంధించి రకరకాల లీకులు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ఎలాంటి తప్పు చేయలేదన్నారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకే ఫార్ములాఈ రేస్ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తాము తప్పు చేశామని, సభలో చర్చించి చెప్పాలని డిమాండ్ చేశారు. తాము చేసిన తప్పు ఎందుకు కాదో కూడా ఈ సభ ద్వారా ప్రజలకు చెబుతాం. మీరు పెట్టినది అక్రమ కేసు కాకపోతే ఈ సభలో చర్చించాలన్నారు. తానేమీ తప్పు చేయలేదని కేటీఆర్ చెప్పారని అన్నారు.అక్రమ కేసు పెట్టినప్పుడు వివరించేందుకు కేటీఆర్‌కు అవకాశం ఇవ్వాలన్నారు. 420 హామీలకు కట్టుబడి లగచర్ల రైతుల పక్షాన పోరాడుతున్న కేటీఆర్‌పై కాంగ్రెస్ కేసు పెట్టిందని విమర్శించారు. ఈ నేపథ్యంలో సభ సజావుగా సాగేందుకు అందరూ సహకరించాలని స్పీకర్


మిగతా 2లో

# ఫార్ములా ఈ కార్ రేసుపై ఎప్పుడైనా ఎక్కడైనా చర్చకు సిద్ధం

మొదటి పేజీ తరువాయి

వస్తా.. చర్చ చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అవసరం అనుకుంటే వాళ్ల పార్టీ ఆఫీస్ కి ఐనా వెళ్తానని తెలిపారు. హెచ్ఎండీఏ ఖాతాలోని డబ్బులు లండన్ కంపెనీకి ఎలా వెళ్ళాయని సీఎం అడిగారు. ఈ కార్ రేస్ అగ్రిమెంట్ రూ.55 కోట్లు కాదు.. రూ.600 కోట్లు అని ముఖ్యమంత్రి తెలిపారు. రూ. 600కోట్లు లూటీ చేయాలని ఫార్ములా ఈరేస్ తెచ్చారని సీఎం పేర్కొన్నారు. నగదు బదిలీ చేయాలంటే ఆర్బీఐ అనుమతి ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.ఓఆర్ఆర్ టెండర్లు రద్దు చేయండని అంటున్నారు.. విచారణ జరగకుండా రద్దు చేస్తారా..? అని సీఎం ప్రశ్నించారు. విచారణ అడిగింది వాళ్ళే.. డిమాండ్ చేసింది వాళ్ళేనని సీఎం తెలిపారు. చర్చకు నేను వెనక్కి పోయే వాడినా అధ్యక్షా.. దేని మీద నైనా చర్చకు సిద్ధంగా ఉంటానని ముఖ్యమంత్రి చెప్పారు. హరీష్ రావు అడిగితేనే ఓఆర్ఆర్ పై సిట్ వేశామన్నారు. ఈ విషయంపై కేసీఆర్ ఇంట్లో గొడవ జరిగిందని తెలిపారు. ఇంటికి వెళ్లాక హరీష్ కు కొరడా దెబ్బలు ఉంటాయన్నారు. హరీష్ బాధను తాను అర్థం చేసుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. భూ భారతి అంటే ఇందిరమ్మ.. పేదలకు భూమి ఇచ్చింది ఇందిరమ్మ అని సీఎం అన్నారు. పేదలకు భూముల హక్కులు ఇస్తాం.. బీఆర్ఎస్ వాళ్ళు రిటర్న్ గా సూచన పంపినా... విలువైన సూచన చేస్తే తీసుకుంటామని ముఖ్యమంత్రి తెలిపారు.ఫార్ములా ఈ కార్ రేసింగ్ పై సభలో చర్చించాలని కేటీఆర్ ఇంతకాలం ఎందుకు అడగలేదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అసెంబ్లీలో సీఎం మాట్లాడుతూ.. "ఈ కార్ రేస్ ప్రతినిధులు వచ్చి నన్ను కలిశారు. రూ.600 కోట్లు పెండింగ్ నిధులు రావాల్సి ఉంది.. ఇవ్వమని అడిగారు. మీరు ఊ.. అంటే మరోసారి రేసింగ్ నిర్వహిస్తామని చెప్పారు. ఎఫ్ఈవో ప్రతినిధులు వచ్చి కలిసిన తర్వాతే ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. హెచ్ఎండీఏ ఖాతాలోని రూ.కోట్ల నిధులు లండన్‌లోని కంపెనీకి నేరుగా ఎలా వెళ్తాయి? నిర్వాహకులతో కేటీఆర్ కుదుర్చుకున్న ఒప్పందం రూ.600 కోట్ల విలువైనది. మిగతా డబ్బు కోసం వాళ్లు వచ్చినప్పుడే ఈ విషయం నా దృష్టికి వచ్చింది. ఓఆర్ఆర్ అమ్మినా.. హెచ్ఎండీఏ నిధులు కాజేసినా.. అడగవద్దన్నట్లు మాట్లాడుతున్నారు. నేను జాగ్రత్త పడటం వల్ల రూ.450 కోట్లు మిగిలాయి. ఈ కార్ రేసింగ్ వ్యవహారంపై ఏసీబీ విచారణ జరుగుతోంది.. హైకోర్టులో కేటీఆర్ వేసిన పిటిషన్‌పై విచారణ జరుగుతోంది కాబట్టి ఎక్కువ వివరాలు వెల్లడించలేను. న్యాయపరంగా చిక్కులు లేకపోతే ఈ వ్యవహారంపై ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధం. అవసరమైతే భారాస కార్యాలయానికి వెళ్లి అయినా చర్చిస్తాం. రూ.55 కోట్లు చిన్న విషయం కాదు" అని సీఎం అన్నారు.





## అప్పులపై తప్పుదోవ పట్టించారు

- మీరిచ్చిన లెక్కలతోనే ఆర్‌బీఐ నివేదిక ఇచ్చింది
- సభా హక్కుల ఉల్లంఘన నోటీసు మేం కదా ఇవ్వాలి?
- రుణాలపై చర్చలో హరీశ్‌రావుపై ఉప ముఖ్యమంత్రి భట్టి ఆగ్రహం

హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:

'రాష్ట్ర అప్పులపై తప్పుడు గణాంకాలు చూపి, సభను తప్పుదోవ పట్టించింది మీరు. కార్పొరేషన్లు, గ్యారంటీల పేరిట రుణాలు తెచ్చి... వాటిని దాచిపెట్టింది మీరు. మేం వాస్తవాలు చెబితే సభా హక్కుల నోటీసు ఇస్తారా? నోటీసు ఎవరికి ఇవ్వాలి... మీకు మేం ఇవ్వాలి కదా?" అని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క... ప్రతిపక్ష సభ్యుడు హరీశ్‌రావుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. శాసనసభలో గురువారం రాష్ట్ర రుణాలపై స్వల్పకాల చర్చలో ఆయన మాట్లాడారు. "రాష్ట్ర అప్పులపై ఆర్థికశాఖ మంత్రిగా గతంలో మీరు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోని లెక్కలనే ఇండియా స్టేట్స్ పేరిట ఆర్‌బీఐ పుస్తకంలో విడుదల చేసింది. మేం ఇచ్చిన శ్వేతపత్రంలో రాష్ట్రానికి రూ.6.71 లక్షల కోట్ల అప్పు ఉన్నట్లు చూపాం. మేం సభను తప్పుదోవ పట్టించామంటూ గత ఆర్థిక మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. అందుకే ఈ చర్చ మొదలుపెట్టాం. ఆర్థిక మంత్రిగా హరీశ్‌రావు ఒక వ్యవహారం చేశారు. తీసుకున్న అప్పులను ఏకమొత్తంగా చూపకుండా 'టెంటెటివ్ రిస్క్ వెయిటెడ్ ఔట్‌స్టాండింగ్'గా చూపారు. అంటే అప్పుల్లో కొంత మాత్రమే లెక్కల్లో చూపుతారు. ఉదాహరణకు గొర్రెల అభివృద్ధి కార్పొరేషన్ పేరిట రూ.1,314 కోట్ల అప్పు తెచ్చారు. దాన్ని కార్పొరేషన్ స్వయంగా తీరుస్తుందని, ప్రభుత్వం 5 శాతానికి గ్యారంటీ ఇస్తుందన్నారు. మరో 5 శాతాన్ని రిస్క్‌గా చూపారు. ఈ లెక్క ప్రకారం ప్రభుత్వం రూ.65 కోట్లే చెల్లించాలి. కానీ, రూ.693 కోట్లు కట్టారు. ఇలాంటి ఎన్నో తిరకాసులు చేశారు. ఇంకెంత అప్పు చేస్తే మీ అప్పు యావ తీరుతుంది హరీశ్‌రావు? కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.64,651 కోట్లు తెచ్చి రిస్క్‌గా రూ.16 వేల కోట్లు చూపారు. మిగతావి రాష్ట్రమే కదా చెల్లించాల్సింది? రాష్ట్ర ఆదాయంలో 90% వరకు అప్పులు తెచ్చుకునే అవకాశాన్ని 200 శాతానికి పెంచారు. రెవెన్యూ వసూళ్లు రూ.1.69 లక్షల కోట్లు ఉంటే ఏకంగా రూ.3.38 లక్షల కోట్లు అప్పు తెచ్చుకునేలా మార్చారు. వారున్నప్పుడు రూ.64 వేల కోట్ల అప్పులను చెల్లించినట్లు హరీశ్‌రావు చెబుతున్నారు. నెలకు రూ.1,500 కోట్ల చొప్పున ఏడాదికి రూ.18 వేల కోట్లు... పదేళ్లలో రూ.1.80 లక్షల కోట్లు కట్టాలి కదా? అప్పులు తెచ్చింది మీరు... చెల్లించాల్సింది మేమా?

**ఇతర మంత్రులు రిస్క్ కాలమ్ పెట్టలేదేం?**

"హరీశ్‌రావు కంటే ముందు ఈటెల, కేసీఆర్ ఆర్థిక శాఖ మంత్రులుగా పనిచేశారు. ఇప్పుడు నేనున్నా. వారెవరూ మీలాగా రిస్క్ శాతం కాలమ్ ఎందుకు పెట్టలేదు? మీరొక్కరే ఎందుకు పెట్టారు?" అని భట్టి ప్రశ్నించారు.




## రణరంగంగా మారిన తెలంగాణ శాసనసభ..

మొదటి పేజీ తరువాయి

రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చర్చ ప్రారంభించారు. అప్పటికే నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మంత్రి మాట్లాడుతున్నంత సేపూ అడ్డుపడ్డారు. ఈ నేపథ్యంలో స్పీకర్ పోడియం వైపు దూసుకెళ్లేందుకు బీఆర్ఎస్ నేతలు ప్రయత్నించగా వారిని మార్షల్స్ అడ్డుకున్నారు. అయినా వెల్‌లోకి దూసుకెళ్లిన హరీశ్‌రావు, బీఆర్ఎస్ సభ్యులు.. స్పీకర్ పోడియం ముందు ఆందోళనకు దిగారు. మార్షల్స్ అడ్డుకునే ప్రయత్నం చేసినా తోసుకుంటూ ముందుకెళ్లే ప్రయత్నం చేశారు.స్పీకర్ పట్ల కూడా దారుణంగా వ్యవహరించారు : ఈ క్రమంలో పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పేపర్లు చింపివేసి సభాపతి స్థానం వైపు విసిరారు. సభలో తీవ్ర గందరగోళం నెలకొనడంతో శాసనసభను పదిహేను నిమిషాల పాటు సభాపతి వాయిదా వేయగా తిరిగి ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో శాసనసభ నుంచి బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. ఈ క్రమంలో సభను ఆర్డర్‌లో పెట్టాలని ఎంఐఎం శాసనసభా పక్షనేత అక్బరుద్దీన్ విజ్ఞప్తి చేశారు. ఆందోళన చేసిన సభ్యులను వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు.తప్పుడు కేసు పెట్టారని భావిస్తే కేటీఆర్ నిరాహార దీక్ష చేయవచ్చు కదా అని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. నిరాహార దీక్ష చేస్తే సానుభూతి అయినా వస్తుందని వ్యాఖ్యానించారు. శాసన సభలో బీఆర్ఎస్ సభ్యుల తీరు ఏమాత్రం బాగోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పుడూ బీఆర్ఎస్ మాత్రమే అధికారంలో ఉండాలా అంటూ పేర్కొన్నారు. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ విపక్ష పార్టీ అహంభావంతో వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. స్పీకర్ పట్ల కూడా దారుణంగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఫార్ములా ఈ కార్ రేస్ అంశంపై అసెంబ్లీలో రచ్చ..

మొదటి పేజీ తరువాయి



విజ్ఞప్తి చేశారు. అయితే ఫార్ములాఈ రేసు విషయంలో స్పష్టమైన హామీ ఇస్తే సహకరిస్తానని హరీశ్ రావు స్పష్టం చేశారు. ఇది సభ్యునికి సంబంధించిన అంశమని, ముందుగా బిల్లులపై చర్చ జరగాలని స్పీకర్ అన్నారు. అందుకు అంగీకరించని బీఆర్ ఎస్ ఎమ్మెల్యే ఫార్ములాఈ కార్ రేస్ పై చర్చకు పట్టుబట్టారు. భూభారతి బిల్లుపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చర్చను ప్రారంభించగానే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్ పోడియం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో స్పీకర్ సభను వాయిదా వేశారు.



## భూభారతి బిల్లుకు శాసనసభ ఆమోదం

మొదటి పేజీ తరువాయి

ఆత్మగౌరవం నిలబెట్టేది భూమి అని సీఎం అన్నారు.భూమిని కాపాడుకునే క్రమంలోనే దొడ్డి కొమురయ్య లాంటివారు ప్రాణాలు కోల్పోయారని రేవంత్ రెడ్డి తెలిపారు. సర్వం ఒడ్డి పోరాటాలు చేసి భూములు కాపాడుకున్నారన్నారు. పేదల భూములను రక్షించేందుకే పటేల్ పట్వారీ వ్యవస్థను గతంలో రద్దు చేశారన్నారు. భూమిలేని పేదలకు ఇందిరాగాంధీ ప్రభుత్వం భూమి ఇచ్చి ఆత్మగౌరవం నిలబెట్టిందన్నారు. ఆక్రమణలు తొలగించి రైతుల హక్కులు కాపాడేందుకు గతంలో ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు తెచ్చాయని రేవంత్ రెడ్డి తెలిపారు.సన్నిహితులకే ధరణి పోర్టల్ అప్పగించారు : విపక్ష పార్టీ అహంభావంతో వ్యవహరిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. స్పీకర్ పట్ల కూడా దారుణంగా వ్యవహరించారని మండిపడ్డారు. గత ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్ రైతులను తమ భూములకు దూరం చేసిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. 2010లో ఒడిశా కూడా ఇదే ధరణి విధానాన్ని తీసుకువచ్చిందన్నారు. ఒడిశా సర్కారే తప్పు చేసిందని ఎన్ఐసీ, కాగ్ సూచిందన్న ఆయన అనుభవం లేని ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సంస్థకు అప్పగించవద్దని హెచ్చరించిందన్నారు. యువరాజుకు అత్యంత సన్నిహితులైన వారికి ధరణి పోర్టల్‌ను అప్పగించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ధరణి పోర్టల్ నిర్వహణ ఏ కంపెనీ చేతిలోకి వెళ్లినా సీఈవోగా గాదే శ్రీధర్‌రాజు ఉన్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు.విలువైన సమాచారం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో : 50 లక్షల రైతుల వివరాలు, భూమి వివరాలను ఓ సంస్థ చేతిలో పెట్టారని రేవంత్ రెడ్డి విమర్శించారు. టెరాసిస్ చేతిలో పెట్టిన ధరణి పోర్టల్ పది సంస్థల చేతులు మారిందని రేవంత్ రెడ్డి ఆక్షేపించారు. మన ధరణి పోర్టల్ ఫిలిప్పీన్స్, సింగపూర్, కెమెన్ ఐలాండ్స్, వర్జిన్ ఐలాండ్ మీదుగా తిరిగిందన్నారు. ఈ పోర్టల్‌ను నిర్వహించిన వాళ్లెవరూ భారతీయులు కాదన్న రేవంత్ రెడ్డి తెలిపారు. ఆర్థిక నేరాలకు పేరొందిన దేశాలు, సంస్థల చేతుల్లో మన రైతుల వివరాలు పెట్టారని మండిపడ్డారు. ఎంతో విలువైన సమాచారాన్ని ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టిన కేసీఆర్‌ను శిక్షించాలన్నారు.ముందుగా జాగ్రత్త పడటం వల్ల రూ.450 కోట్లు మిగిలాయి : మరోవైపు ఫార్ములా ఈ కార్ రేసింగ్ అంశంపై కూడా సీఎం రేవంత్ స్పందించారు. ఫార్ములా ఈ కార్ రేసింగ్ ప్రతినిధులు వచ్చి తనను కూడా కలిశారని తెలిపారు. రూ.600 కోట్ల పెండింగ్ నిధులు రావాల్సి ఉంది ఇవ్వమని అడిగారని వెల్లడించారు. మీరు ఊ అంటే మరోసారి ఈ కార్ రేసింగ్ నిర్వహిస్తామని నిర్వాహకులు తన వద్దకు వచ్చారని తెలిపారు. ఈ కార్ రేసింగ్ గురించి సభలో చర్చించాలని కేటీఆర్ ఇన్నాళ్లు ఎందుకు అడగలేదని ప్రశ్నించారు.ఈ కార్ రేసింగ్‌పై ఏసీబీ విచారణ జరుగుతున్నందున ఎక్కువ మాట్లాడలేనని రేవంత్ రెడ్డి తెలిపారు. హెచ్ఎండీఏ ఖాతాలోని కోట్ల నిధులు నేరుగా లండన్‌లోని కంపెనీకి ఎలా వెళ్తాయని ప్రశ్నించారు. రేసింగ్ నిర్వాహకులతో కేటీఆర్ కుదుర్చుకున్నది రూ.600 కోట్ల ఒప్పందం అని రేవంత్ రెడ్డి తెలిపారు. మిగతా డబ్బుల కోసం వాళ్లు వచ్చినప్పుడే ఈ విషయం తన దృష్టికి వచ్చినందున జాగ్రత్త పడటంతో హెచ్ఎండీఏకు రూ.450 కోట్లు మిగిలాయి అని రేవంత్ రెడ్డి వెల్లడించారు.



## రాహుల్ గాంధీపై విమర్శలు

- పార్లమెంట్‌లో చోటుచేసుకున్న సంఘటనలో
- గాయపడ్డ ఎంపీలు ప్రతాప్ సారంగి, ముఖేష్ రాజపుత్‌లను
- పరామర్శించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్, బండి సంజయ్.
- రాహుల్ గాంధీపై విమర్శలు

ఢిల్లీ,తెలంగాణ ముచ్చట్లు:

గురువారం నాడు పార్లమెంట్‌లో చోటుచేసుకున్న సంఘటనలో గాయపడ్డ ఎంపీలు ప్రతాప్ సారంగి, ముఖేష్ రాజపుత్‌లను ఆర్ఎంఎల్ ఆసుపత్రిలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్, బండి సంజయ్ పరామర్శించారు. పార్లమెంట్‌లో జరిగిన తోపులాటలో ఇద్దరు ఎంపీలు గాయపడటం దేశ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో మొసలి కన్నీళ్లు కారుస్తున్నారు. వరుస ఓటముల కారణంగా ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీలో అసహనం పెరిగిందని విమర్శించారు.అంబేద్కర్ పై గతంలో కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిన తీరును గుర్తుచేసిన కిషన్ రెడ్డి.. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ని అవమానించింది కాంగ్రెస్ పార్టీ అని, కేంద్ర మంత్రివర్గం నుంచి రాజీనామా చేయించిన వారు కూడా వారే. ఆయనకు భారతరత్న ఇవ్వకుండా అడ్డుకున్నది ఎవరు? కేంద్ర హాల్లో విగ్రహం పెట్టకుండా అడ్డుకున్నది కూడా వారే అని ఆయన అన్నారు. అంబేద్కర్ ని అడుగడుగునా అవమాన పరిచిన చరిత్ర కాంగ్రెస్‌ది అని మండిపడ్డారు. అంబేద్కర్ ఆశయాలను అమలు చేస్తూ ప్రధాని నరేంద్ర మోడీ ప్రజల మన్ననలు పొందుతున్నారని కిషన్ రెడ్డి అన్నారు. అంబేద్కర్ గారి ఆలోచనలను ప్రధానమంత్రి మోడీ ఫాలో అవుతున్నారు. ఆయన అడిగిన పంచతీర్థాలను అభివృద్ధి చేసి దేశ ప్రజలకు అంకితం చేశారని తెలిపారు.

రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శలు చేస్తూ, పార్లమెంట్‌లో టీషర్ట్ వేసుకుని యువకుడిగా కనిపిస్తూ ఎంపీలపై దాడులు చేయడం దారుణం అని అన్నారు. రాహుల్ గాంధీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సంఘటనతో దేశ రాజకీయాలు మరింత వేడెక్కాయి. రాహుల్ గాంధీపై ఈ విమర్శలు, పార్లమెంట్‌లో చోటుచేసుకున్న ఘటన రాజకీయ నేతల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది.



## సంగారెడ్డి జైలు నుంచి విడుదలైన లగచర్ల రైతులు..

మొదటి పేజీ తరువాయి

జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న 17 మంది రైతులు ఈ ఉదయం జైలు నుంచి విడుదలయ్యారు. జైలు నుంచి బయటకు రాగానే ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ మేరకు వారికి గిరిజన సంఘాలు, బీఆర్ ఎస్ నాయకులు స్వాగతం పలికారు. కాగా, ఈ కేసులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న నిందితులకు నాంపల్లి కోర్టు బుధవారం బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే. కాగా, రైతులు గురువారమే జైలు నుంచి విడుదల కావాల్సి ఉన్నా.. బెయిల్ పత్రాలు జైలు అధికారులకు ఆలస్యంగా అందాయి.దీంతో ఈ ఉదయం రైతులు జైలు నుంచి విడుదలయ్యారు. మరోవైపు ఇదే కేసులో ఏ1గా ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి సహా మొత్తం 24 మందికి నాంపల్లి ప్రత్యేక కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. నాంపల్లి కోర్టు నరేందర్ రెడ్డికి రెండు పూచీకత్తులను సమర్పించాలని ఆదేశించింది. 50,000 చొప్పున చెల్లించాలని, 3 నెలల పాటు వారానికి ఒకసారి బొంరాస్‌పేట ఎస్‌హెచ్ఓ ఎదుట హాజరుకావాలని, విచారణకు సహకరించాలన్నారు. అదేవిధంగా, అదే కేసులో నిందితులుగా ఉన్న ప్రతి ఒక్కరికీ రూ.లక్ష పూచీకత్తు ఇవ్వాలని షరతులు విధించింది. 20,000 మరియు ప్రతి వారం పోలీసుల ముందు హాజరు కావాలి. అయితే ఈ కేసులో ప్రధాన నిందితుడు భోగమోని సురేష్‌తోపాటు మరో ఏడుగురికి బెయిల్ లభించలేదు.మరోవైపు జిల్లా కలెక్టర్ పై దాడి ఘటనతో అస్సలు మాకు సంబంధం లేదని లగచర్ల రైతులు తెలిపారు. అయినా మమ్మల్ని అన్యాయంగా అరెస్ట్ చేశారని వాపోయారు.కరెంట్ బంద్ చేసి అర్ధరాత్రి ఇండ్లలో నుంచి పోలీసులు తీసుకువెళ్లారని తెలిపారు. బతుకు దెరువు కోసం సౌదీ వెళ్లేందుకు పాస్ పోర్ట్ అప్లై చేసుకుంటే ఈ కేసుతో క్యాన్సిల్ అయ్యిందని కన్నీరు మున్నీరుగా విలపించారు. ప్రాణాలు పోయిన మా భూములు ఇవ్వమని, ఇండస్ట్రీ కారిడార్ కి కూడా భూములు ఇవ్వమని రైతులు తెలిపారు.

## హైకోర్టులో కేటీఆర్‌కు ఊరట..

మొదటి పేజీ తరువాయి



జడ్జ్ అడిగారు.దర్యాప్తులో ఈ కేసులో భాగస్వామ్యులైన వాళ్ళ పేర్లు బయటకు వస్తాయని ఏజీ అన్నారు. విదేశీ కంపెనీకి ప్రజధనం బదిలీ అయ్యింది.. ఈ ఏడాది నిర్వహించాలనుకున్న ఫార్ములా ఈ కార్ రేసింగ్ కోసమే చెల్లింపులు జరిగాయని ఏజీ తెలిపారు. ఇది అత్యవసర పిటిషన్ విచారణ కాదని ఏజీ పేర్కొన్నారు. డబ్బుల చెల్లింపులో అక్రమాలు జరిగాయి.. హెచ్ఎండీఏ ఇందులో భాగస్వామి కాకున్నా 55 కోట్లు చెల్లించిందన్నారు. ఇందులో కేటీఆర్‌కు ఎలాంటి లబ్ది చేకూరిందని ఏజీని న్యాయమూర్తి ప్రశ్నించారు. ఎవరెవరికి ఎలాంటి లబ్ది చేకూరిందనేది దర్యాప్తులో తేలుతుందని ఏజీ తెలిపారు. ఇరు వైపులా వాదనలు విన్న న్యాయస్థానం కేటీఆర్‌ను ఈ నెల 30 వరకు అరెస్ట్ చేయొద్దని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఏసీబీ దర్యాప్తు మాత్రం కొనసాగించవచ్చని తెలిపింది.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# భారాస చిల్లర వేషాలను ప్రజలు హర్షించరు: మంత్రి పొంగులేట

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

గతంలో చేసిన తప్పులను సరిదిద్దుకోకుండా భారాస సభ్యులు వక్రబుద్ధితో వ్యవహరిస్తున్నారని తెలంగాణ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ) విమర్శించారు. శాసనసభలో భూ భారతి బిల్లుపై చర్చ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ఫార్ములా ఈరేసు అంశంపై చర్చకు భారాస సభ్యులు పట్టుబట్టడంతో పాటు స్పీకర్ పోడియం వైపు దూసుకెళ్లేందుకు యత్నించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వారి ఆందోళనల మధ్యే భూ భారతి బిల్లుపై పొంగులేటి తన ప్రసంగాన్ని కొనసాగించారు.

‘‘భారాస సభ్యులు భూ భారతి బిల్లును ఆమోదించకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. వారి తీరు సభ్యసమాజం సిగ్గుపడేలా ఉంది. సభలో గూండాగిరి, దౌర్జన్యం, రౌడీయిజం లేకుండా స్పీకర్ చర్యలు చేపట్టాలి. భారాస హయాంలో తీసుకొచ్చిన ‘ధరణి’ పోర్టల్ తప్పులతడకగా ఉందని కేసీఆర్‌కు తెలుసు. ఆయన 80వేల పుస్తకాలు చదివారు. పుస్తకాలను క్షుణ్ణంగా పరిశీలించి ధరణి పోర్టల్ రూపొందించారని అనుకునేవాళ్లం. ఆ చట్టానికి మూడేళ్లకే వందేళ్లు నిండాయి. ఇందిరమ్మ రాజ్యంలో 1971లో చేసిన చట్టం.. 49 ఏళ్లుగా ప్రజల్లో ఉంది. భూ భారతి బిల్లుకు సంబంధించి భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అనేక సూచనలు ఇచ్చారు. ఈ బిల్లు సభలో ప్రవేశ పెట్టినప్పుడు ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ కూడా సూచనలు చేస్తారని ఆశించాం. అవి చట్టంలో పొందుపరచాలని భావించాం. కేసీఆర్ రాలేదు.. సభలో ఉన్నవాళ్లు ఈరకంగా గొడవ చేస్తున్నారు. భారాస చిల్లర వేషాలను ప్రజలు హర్షించరు’’ అని పొంగులేటి వ్యాఖ్యానించారు.



### హరీశ్‌రావుపై స్పీకర్ ఆగ్రహం

**అంతకుముందు హరీశ్‌రావు తీరుపై స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భారాస సభ్యుల ఆందోళన సందర్భంగా స్పీకర్ మాట్లాడారు. “హరీశ్‌రావు తీరు రాష్ట్ర ప్రజలకు తీరని అన్యాయం చేసేలా ఉంది. సభను తప్పుదోవ పట్టించడం సరికాదు. భూ భారతి ముఖ్యమైన బిల్లు. ప్రజలకు సంబంధించిన బిల్లులపై చర్చల సమయంలో ఇలా ప్రవర్తించడం సరికాదు. ఈ బిల్లు ఇష్టం లేదా? రైతులకు సాయం చేయడం ఇష్టం లేదా?”అని స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.**

# రాష్ట్ర ప్రత్యేక అవసరాలను గుర్తించి కేంద్రం ప్రోత్సాహం అందించాలి: భట్టి

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**



దేశ అభివృద్ధిలో గ్రోత్ ఇంజిన్‌గా ఉండే తెలంగాణ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, రాష్ట్ర ప్రత్యేక అవసరాలను గుర్తించి తగిన ప్రోత్సాహం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. రాజస్థాన్‌లోని జైపుర్ వేదికగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో జరిగిన ప్రీ బడ్జెట్ సమావేశంలో భట్టి విక్రమార్క, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను సమావేశంలో భట్టి వివరించారు. కేంద్ర ప్రాయోజిత పథకాల నుంచి తెలంగాణకు నిధులు తక్కువగా వస్తున్నాయని, జనాభా ప్రాతిపదికన కేంద్ర పథకాల్లో రాష్ట్రానికి నిధులు ఇవ్వాలని కోరారు.

‘‘స్థానిక పరిస్థితులకు తగ్గట్లుగా కేంద్ర పథకాలు ఉపయోగించుకునే వెసులుబాటు ఉండాలి. విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన రూ.1800 కోట్ల పెండింగ్ గ్రాంట్లు విడుదల చేయాలి. వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఏడాదికి రూ.450 కోట్ల నిధులు మరో ఐదేళ్ల పాటు పొడిగించాలి. తెలంగాణలోని వెనకబడిన జిల్లాల్లో పారిశ్రామిక పార్కులు, సాగునీటి ప్రాజెక్టులు, జాతీయ రహదారులకు నిధులు మంజూరు చేయాలి. స్మార్ట్ సిటీస్ మిషన్ పొడిగించాలి. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల రంగానికి పీఎల్ఐ పథకాన్ని అమలు చేయాలి’’ అని భట్టి కోరారు.

# జైలుకెళ్లి యోగా చేస్తానన్న కేటీఆర్ ఎందుకు భయపడుతున్నారు?

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**



పార్లమెంటులో అంబేడ్కర్‌ను, అసెంబ్లీలో దళిత స్పీకర్‌ను అవమానించారని మంత్రి సీతక్క అన్నారు. అసెంబ్లీ ఆవరణలో మీడియాతో చిట్‌చాట్‌లో ఆమె మాట్లాడారు. క్యాబినెట్ ఆమోదం తీసుకొని ఫార్ములా ఈరేసుకు కేటీఆర్ డబ్బులు చెల్లించారా అని ప్రశ్నించారు. ప్రభుత్వ అనుమతి లేని అంశానికి సభలో చర్చ ఎందుకు అని అడిగారు. గవర్నర్ క్లియరెన్స్ ఇచ్చిన కేసుకు సభలో చర్చ అవసరం లేదని చెప్పారు. బీఏసీలో ఫార్ములా ఈరేసు మీద చర్చ కోసం భారాస ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. ముసుగు వేసుకుని భారాస రాజకీయం చేస్తోందని విమర్శించారు.

‘‘జైలుకు వెళ్లి యోగా చేస్తానన్న కేటీఆర్ ఎందుకు భయపడుతున్నారు. తప్పు చేయకపోతే విచారణ ఎదుర్కొని నిర్దోషిగా బయటికి రావచ్చు కదా? కేటీఆర్ తన సమస్యను రాష్ట్ర ప్రజల సమస్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో ప్రభుత్వ కేసులు ఎదుర్కొన్న నాయకులు కోర్టుకు వెళ్తే తప్పు పట్టిన ఆయన.. ఇప్పుడు కోర్టు మెట్లు ఎందుకు ఎక్కారు? కేటీఆర్‌కు నిజాయతీ లేదు. లక్షలాది మంది రైతులకు ప్రయోజనం చేకూర్చే భూ భారతి బిల్లుపై చర్చ జరగకుండా అడ్డుకునే కుట్ర చేస్తున్నారు. వాళ్ల భూ కబ్జాల బాగోతం బయట పడుతుందనే ఇలా చేస్తున్నారు. అందరూ చట్టం ముందు సమానులే.. ఫార్ములా ఈరేసు కేసులో విచారణ ఎదుర్కోవాల్సిందే’’ అని సీతక్క చెప్పారు.



# కాంగ్రెస్ ప్రభుత్వమైనా భూముల ఆడిటింగ్ చేయాలి: అక్బరుద్దీన్ ఒవైసీ

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

ఫార్ములా ఈరేసు అంశంపై చర్చకు భారాస సభ్యులు పట్టుబట్టడంతో పాటు స్పీకర్ పోడియం వైపు దూసుకెళ్లేందుకు యత్నించడంతో సభలో కాసేపు గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. భారాస సభ్యుల తీరును ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ తప్పుబట్టారు. ఈ రోజు సభలో జరిగింది పదేళ్ల భారాస పాలనను తెలియజేస్తోందని వ్యాఖ్యానించారు. సభ్యులు ప్రజల సమస్యలు ప్రస్తావించేందుకు సభకు వస్తారని.. ఇలా ఆందోళన చేసేందుకు కాదన్నారు. పదేళ్ల భారాస పాలన.. కచరా గవర్నెన్స్ అని ఘాటు వ్యాఖ్యలు చేశారు.‘‘ఇవాళ సభలో జరిగింది భారాస సంస్కృతికి నిదర్శనం. భారాస సభ్యులకు కేసీఆర్ బోధించింది ఇదేనా? ధరణి.. ఒక కుటుంబం కోసం.. ఒక పార్టీ కోసమే తెచ్చారు. భూముల ఆడిటింగ్ జరగాలని పదేళ్లుగా డిమాండ్ చేస్తున్నా. నా డిమాండ్‌ను భారాస ఏనాడూ పట్టించుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా భూముల ఆడిటింగ్ చేయాలి’’ అని అక్బరుద్దీన్ కోరారు. సభలో చర్చ కొనసాగుతుండగానే భారాస సభ్యులు వాకౌట్ చేశారు.

**కేటీఆర్ నిరాహార దీక్ష చేయొచ్చు కదా?: కూనంనేని**

సభలో భారాస సభ్యుల తీరు ఏమాత్రం బాగోలేదని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. భారాస నేతలు పదేళ్ల పాటు తెలంగాణ ప్రజల గొంతు నొక్కేశారని మండిపడ్డారు. ‘‘మా గొంతు నొక్కే అధికారం మీకు ఎవరిచ్చారు? తప్పుడు కేసు పెట్టారని కేటీఆర్ భావిస్తే నిరాహార దీక్ష చేయవచ్చు కదా?అలా చేస్తే కనీసం సానుభూతి అయినా వస్తుంది’’ అని కూనంనేని అన్నారు.



# సీఎం రేవంత్‌ను కలిసిన ఛత్తీస్ ఘడ్ కాంగ్రెస్ ప్రెసిడెంట్

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణలోని కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వ పనితీరుపై ఛత్తీస్ ఘడ్ అధ్యయనం చేస్తున్నది. పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ స్కీమ్‌ల అమలు తీరును పరిశీలిస్తున్నది. స్వయంగా అక్కడి పీసీసీ హైదరాబాద్‌కు వచ్చి అబ్జర్వ్ చేస్తున్నారు. దీనిలో భాగంగానే ఆ రాష్ట్రం పీసీసీ అధ్యక్షుడు దీపక్ బైజ్... తెలంగాణ సీఎం, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను ప్రత్యేకంగా కలిశారు. పార్టీ కార్యక్రమాలపై మహేష్‌గౌడ్‌ను, ప్రభుత్వ స్కీమ్స్ ఇంప్లిమెంటేషన్‌పై సీఎం రేవంత్‌ను అడిగి తెలుసుకున్నారు. పార్టీ సమస్యలు, సవాళ్లను ఎదుర్కోవడంపై చర్చించారు. దీంతో పాటు ఆ రాష్ట్రంలో అధికార పార్టీపై చేయాల్సిన ఒత్తిడి, ప్రజల్లో మైలేజ్ పొందేందుకు పాటించాల్సిన వ్యూహాలపై కూడా వివరాలు సేకరించారు. నేతల మధ్య సమన్వయం, పార్టీని మరింత పటిష్ఠంగా తయారయ్యేందుకు వ్యవహరించాల్సిన విధానాలపై కూడా చత్తీస్ ఘడ్ పీసీసీ అధ్యక్షుడు ఆరా తీస్తున్నారు. గడిచిన రెండు రోజులుగా హైదరాబాద్‌లోనే ఉంటూ సీరియస్‌గా స్టడీ చేస్తున్నారు. ఏఐసీసీ ఆదేశం మేరకే ఆయన అధ్యయనం చేస్తున్నట్లు పార్టీ వర్గాల్లో టాక్. ఇక తెలంగాణతో పాటు చత్తీస్ ఘడ్‌కు కూడా త్వరలో కొత్త పీసీసీ కార్యవర్గం ఏర్పాటు కానున్నది. దీంతో కార్యవర్గం ఎలా ఉండాలి? కమిటీ పరిమితులు, పార్టీ యాక్టివిటీస్, ప్రణాళికలు, సెంట్రల్, స్టేట్ అధికార పార్టీలపై పోరాటం చేయాల్సిన తీరుపై కూడా ఆ రాష్ట్రం పీసీసీ క్షుణ్ణంగా అడిగి తెలుసుకుంటున్నారు. ఇవన్నీ భవిష్యత్‌లో చత్తీస్ ఘడ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్లస్ అయ్యేందుకు ఉపయోగపడతాయని టీపీసీసీ నేతలు స్పష్టం చేస్తున్నారు.

**ప్రతిపక్షంగా పోరాటం ఎలా..?**


టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు తీసుకున్న తర్వాత కాంగ్రెస్ పార్టీలో జోష్ పెరిగింది. పీసీసీ అధ్యక్షుడిగా ఆయన ఆదేశాలతో రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ క్రియాశీలక పోరాటం చేసింది. అప్పటి అధికార పార్టీ బీఆర్ఎస్(టీఆర్ఎస్)ను ఇరకాటంలో పెట్టేందుకు వివిధ విధానాలు, పద్ధతులను పాటించింది. అప్పటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల్లోని తప్పిదాలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించేందుకు వినూత్నమైన నిరసనలు, ఆందోళనలు నిర్వహించింది. సరిగ్గా ఎన్నికలకు ఆరు నెలల ముందు అప్పటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కాంగ్రెస్‌కు ఆధారణ పెరిగేందుకు మాజీ సీఎం కేసీఆర్‌పై పెద్ద యుద్ధమే చేశారు. రైతుల సమస్యలు, నిరుద్యోగుల సమస్యలు, మహిళా సంఘాల సవాళ్లను ప్రధానంగా ఎత్తుకొని బీఆర్ఎస్ ప్రభుత్వంపై పోరాటం చేశారు. ఇక గత ప్రభుత్వం అమలు చేసిన స్కీమ్‌లలో తప్పిదాలు, ప్రాజెక్టులలో నిర్లక్ష్యం, అవినీతి ఆరోపణలు వంటివన్నీ ప్రజల్లోకి సులువుగా తీసుకువెళ్లగలిగారు. ఇవన్నీ ఓ ప్రణాళిక బద్ధంగా అమలు చేయడంతో ఎన్నికలకు మూడు నెలల ముందు నుంచి కాంగ్రెస్‌కు వేవ్ మొదలైంది. ఇది మౌత్ పబ్లిసిటీగా మారి గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్‌కు ఊహించని ఆధారణ లభించింది. తద్వారా ప్రస్తుతం పార్టీ పవర్‌లోకి వచ్చింది. ఇక పవర్‌లోకి వచ్చిన కొద్ది రోజుల తర్వాత పీసీసీ అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్ నియామకం అయ్యారు. ఆయన కూడా ఏడాది పాటు పార్టీని విజయవంతంగా ముందుకు తీసుకువెళ్తున్నారు. ఈ నేపథ్యంలోనే చత్తీస్ ఘడ్ కాంగ్రెస్ పార్టీ ఇక్కడి అంశాలపై గమనంలోకి తీసుకున్నది.

**పవర్‌లోకి వచ్చేందుకు..?**

ప్రస్తుతం ఛత్తీస్ ఘడ్ రాష్ట్రంలో బీజేపీ పవర్‌లో ఉన్నది. కేంద్రంలోనూ అదే పార్టీ ఉన్నది. దీంతో ఆ పార్టీపై యుద్ధం ఎలా చేయాలని ఆ రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు ఆసక్తిగా తెలుసుకుంటున్నారు. పైగా తెలంగాణలోని అసెంబ్లీ ఎన్నికల కంటే ముందున్న పీసీసీ అధ్యక్షుడే ఇప్పుడు సీఎంగా ఉన్నారు. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో ఫైట్ చేయాల్సిన తీరు, అధికార పార్టీలను ఇబ్బంది పెట్టేందుకు తీసుకోవాల్సిన పాలసీలు, పవర్ పార్టీని డీ మోరల్ చేసేందుకు ఎత్తుకోవాల్సిన అంశాలను చత్తీస్ ఘడ్ పీసీసీ స్పష్టంగా తెలుసుకుంటున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కంటే ముందున్న పీసీసీ ఈ విషయంలో సక్సెస్ ఫుల్ అనే ముద్ర ఉన్నది. దీంతోనే ఛత్తీస్ ఘడ్ పీసీసీ ఈ స్టేట్‌పై ఫోకస్ పెట్టారని పార్టీలోకి ఓ కీలక నేత వెల్లడించారు.

# కేటీఆర్ లాగే హరీష్ రావుకూ మతి భ్రమించింది..

○ **కాంగ్రెస్ ఎమ్మెల్సీ హాట్ కామెంట్స్**



బీఆర్ఎస్ నాయకులు నిజంగా తప్పు చేయకుంటే ఎందుకు భయపడుతున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ అన్నారు. మీడియాతో బీఆర్ఎస్ నేత హరీష్ చేసిన వ్యాఖ్యలకు స్పందించిన ఆయన.. ట్విట్టర్ వేదికగా వీడియో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచడానికే ఫార్ములా ఈ రేస్ తీసుకొచ్చామని హరీష్ రావు అంటున్నారని, కానీ ప్రొసీజర్ ప్రకారం వెళ్తే ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదని, అక్రమాలకు పాల్పడుతూ ప్రొసీజర్ ఫాలో కాలేదు కాబట్టే అసెంబ్లీలో చర్చ పెట్టమన్నారని తెలిపారు. నియమ నిబంధనలు పాటించలేదు అంటేనే అందులో అవకతవకలు జరిగినట్లు స్పష్టంగా అర్థం అవుతుందని అన్నారు. దీనిపై ఎఫ్ఐఆర్ నమోదు అయ్యింది కాబట్టి స్పష్టమైన విచారణ జరిగి, తప్పు ఎవరు చేశారు అనేది బయటపడుతుందని చెప్పారు. కానీ విచారణకు సహకరించకుండా, తమ కుటుంబసభ్యుడు జైలుకు పోతాడని.. రైతులపై చర్చలో కూడా పాల్గొనలేదంటే తెలంగాణ ప్రజలపై మీ నిర్లక్ష్య వైఖరి ఈ రోజు స్పష్టమైందని ఆరోపించారు. నిజంగా మీరు తప్పు చేయనప్పుడు ఎందుకు భయపడుతున్నారని, గతంలో ఓ ప్రెస్ మీట్ లో కేటీఆర్ తప్పు చేయకపోతే ఆణిముత్యాల్ల బయటికి రావాలని అన్నారని, ఈ మాటలు ఆయనకు వర్తించవా అని నిలదీశారు. పథకాల పేరుతో మీరు చేసిన అన్ని స్కాముల్లో తప్పకుండా విచారణ జరుగుతుందని, తప్పు చేసిన వారు ఎవరైనా జైలుకు వెళ్లాల్సిందేనని స్పష్టం చేశారు.

# ‘నా ఛాంబర్‌లో మాట్లాడుకుందాం రండి’.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు స్పీకర్ సూచన

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**



ఈ కార్ రేస్ ఒక వ్యక్తికి సంబంధించిన అంశమని, భూ భారతి బిల్లు రాష్ట్రానికి సంబంధించిన అంశమని, ఇది చాలా ముఖ్యమని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా శుక్రవారం బీఆర్ఎస్ నేతలు సభ జరగకుండా ఆందోళన నిర్వహించడంపై ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గవర్నమెంట్ బిల్లుపై చర్చ ఉందని, ఆ తర్వాత ఈ కార్ రేస్ పై చర్చ జరుపుదామని స్పీకర్ హరీశ్ రావుకు వివరించారు. హరీశ్ రావు సీనియర్ సభ్యుడని, అన్ని తెలిసి ఇలా చేయడం తగదన్నారు. కార్ రేసింగ్‌పై మంత్రి లేకుండా చర్చ ఎలా జరుపుతారని ఫైరయ్యారు.

బీఆర్ఎస్ నేతలు ప్రజలకు అన్యాయం చేసేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. భూభారతి బిల్లు పాస్ అయ్యాక తన చాంబర్‌కు పిలుస్తానని, అక్కడ మాట్లాడుదామని స్పష్టం చేశారు. ఈ చట్టానికి మద్దతు తెలపాలని సూచించారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే రేపూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ.. గవర్నర్ అనుమతి ఇచ్చి.. ఏసీబీ కేసు పెట్టిన తర్వాత సభలో చర్చ జరగదని, చర్చకు సంబంధించిన అంశం సభలో ఉత్పన్నం కాదని నొక్కిచెప్పారు.



# క్షేత్రంలో సంప్రదాయ ఆరాధనలు

**యాదగిరిగుట్ట, తెలంగాణ ముచ్చట్లు:**

యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రంలో గురువారం ప్రధాన, అనుబంధ ఆలయాల్లో ధనుర్మాస వేడుకలు కొనసాగాయి. ప్రధాన దేవాలయంలో పంచనారసింహులకు చేపట్టిన ఆస్థాన, ఆర్జిత పూజలు ఆలయ ఆచారంగా కొనసాగాయి. వేకువజామున సుప్రభాతం చేపట్టిన పూజారులు గర్భాలయ ద్వారాలను తెరిచి మూలవరులను హారతితో కొలిచారు. అమ్మవారి మండపంలో గోదాదేవి తిరుప్పావై పాశురాలతో కూడిన వ్రత పర్వం నిర్వహించారు. నిత్యపూజల్లో స్వయంభువులకు పాలతో నిజాభిషేకం నిర్వహించాక, తులసీపత్రాలతో అర్చన చేపట్టారు. శ్రీలక్ష్మీనరసింహ స్వామి మూర్తులకు స్వర్ణ పుష్పార్చన జరిపారు. వేద, మంత్ర పఠనంతో ఆలయ మహాముఖ మండపంలో యజ్ఞమూర్తులకు సువర్ణ పుష్పార్చన క్రతువు కొనసాగించారు. ఉగ్ర నరహరిని శాంతింపజేసేందుకు శ్రీసుదర్శన నారసింహ హోమం నిర్వహించారు. లోకకల్యాణార్థమై శ్రీ లక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని ఆలయ ఆచారంగా చేపట్టారు. కల్యాణమూర్తులను గజ వాహనంపై అలంకృతులను చేసి సేవా పర్వాన్ని నిర్వహించారు. సాయంత్రం వేళ అలంకార జోడు సేవలను మంగళవాయిద్యాలు, మంత్ర పఠనాలతో మాడవీధుల్లో ఊరేగించారు. రాత్రి గర్భాలయంలోని స్వయంభువులను కొలుస్తూ ప్రత్యేక ఆరాధన జరిపారు. దర్బార్ సేవోత్సవంలో నిత్యాదాయం వెల్లడించారు. అనుబంధంగా కొనసాగుతున్న శివాలయంలో నిత్యపూజలు ఆలయ ఆచారంగా కొనసాగాయి.



# డిఆర్డిఓ కార్యాలయంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**




జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో క్రిస్మస్ ముందస్తు వేడుకలు శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీను,డీడీ శ్రీనివాస్ కుమార్ ముఖ్య అతిధులుగా హాజరై క్రిస్మస్ కేకును కోశారు.ఈ సందర్భంగా మేన శ్రీను మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ ప్రపంచవ్యాప్తంగా కులమతాలకు అతీతంగా ఆనందంతో జరుపుకునే విశిష్టమైన పండుగ అని అన్నారు. క్రైస్తవ సోదరులు, సోదరీమణులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. జీసస్ చేసిన మార్గదర్శక కృషి మనకు ఐక్యత, సేవాభావం, సత్యనిష్ఠను నేర్పుతుందని తెలిపారు.డీడీ శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ క్రిస్మస్ పండుగను ఐక్యత, స్నేహభావానికి చిహ్నంగా చూడాలని, ఇతరులకు సహాయం చేయడంలో ముందుండాలని సూచించారు. జీసస్ ప్రవక్త చెప్పిన ప్రేమ, సహనం, సేవ అనే మూల్యాలను అనుసరిస్తూ జీవించాలని అన్నారు.ఈ వేడుకలో అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్ రావు, సెర్ప్ అదనపు అధికారి సుదీర్, కార్యాలయ అధికారి శ్రీనివాస్ రెడ్డి, సూపరింటెండెంట్లు శ్రీనివాస్ స్వామి, ఇందిర, తహసీల్దార్ మహేశ్వరెడ్డి, జిల్లా ప్రాజెక్టు అధికారి దాసు, పసునూరి సంపత్ కుమార్, ఊర్మిళ, మాధురిక, జోయెల్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# కొత్త వివాదాలు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు: ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

ఇటీవల కాలంలో మందిర్‌మసీద్ వివాదాలు గణనీయంగా పెరగడం ఆందోళనకరమని రాష్ట్రీయ స్వయంసేవక్ అధినేత మోహన్ భాగవత్ ఆందోళన వ్యక్తం చేశారు. అయోధ్య రామమందిర నిర్మాణం తర్వాత ఇలాంటి వివాదాలను రాజేసి తాము కూడా హిందూ నాయకులం కావచ్చని కొందరు వ్యక్తులు భావిస్తున్నారన్నారు. ఇది తమకు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని వెల్లడించారు. పుణెలో ‘ఇండియాది విశ్వగురు’ అనే అంశంపై సహజీవన్ వ్యాఖ్యానాల కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. కలుపుగోలు సమాజాన్ని ఆయన సమర్థించారు. మన దేశం సామరస్యంగా ఉంటుందని ప్రపంచానికి చాటాల్సిన అవసరం ఉందని భాగవత్ పేర్కొన్నారు. తాము హిందువులం కాబట్టే రామకృష్ణ మిషన్‌లో కూడా క్రిస్మస్ వేడుకలు చేసుకొంటామని పేర్కొన్నారు. మనం చాలాకాలంగా సామరస్యంగా ఉంటున్నామని.. దీనిని మనం ప్రపంచానికి అందించాలనుకొంటే.. ఓ ఉదాహరణగా నిలవాలన్నారు. ప్రస్తుతం దేశం రాజ్యాంగం ప్రకారం నడుస్తోంది. దీనిలో ప్రభుత్వాన్ని నడిపే ప్రజాప్రతినిధులను వారే ఎన్నుకొంటారు. ఎవరో ఒకరి ఆధిపత్యం చేసే రోజులు ఎప్పుడో పోయాయి. ప్రతిఒక్కరూ తమను తాము భారతీయులుగా చెప్పుకొంటున్నప్పుడు ఆధిపత్యం భాష ఎందుకు..? ఎవరు మైనార్టీ..? ఎవరు మెజార్టీ..? ప్రతిఒక్కరూ సమానమే. ఎవరి ఇష్టమైన భగవత్ ఆరాధనను వారు పాటించడమే ఈ దేశ ఆచారం. కాకపోతే నిబంధనలు, చట్టాలకు లోబడి సామరస్యంగా జీవించడం అవసరం’’ అని భాగవత్ ప్రసంగంలో పేర్కొన్నారు.




# ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ యాప్ సర్వేను పూర్తి చేయాలి

- జిల్లా ఇన్చార్జి కలెక్టర్ సత్య శారద దేవి

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**
ఈ నెలాఖరు లోగా ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ యాప్ సర్వేను పూర్తి చేయాలని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ సత్య శారద దేవి అధికారులకు ఆదేశించారు.శుక్రవారం వరంగల్ మున్సిపల్ పరిధి లోని క్రిస్టియన్ కాలనీ, (లేబర్ కాలనీ) హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం, అక్కంపేట గ్రామాలలో సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భూమి ఉండి గృహ నిర్మాణం కోసం సమగ్ర సర్వే ద్వారా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను ఎంపిక చేసే ప్రక్రియలో భాగంగా సర్వే నిర్వహిస్తున్న ప్రత్యేక బృందాల పనితీరును, లబ్ధిదారుల వివరాలను పొందుపరచు తీరును సిబ్బందిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ సత్య శారద దేవి మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులు గృహ నిర్మాణానికి అవసరమైన స్థలంతో పాటు రేషన్ కార్డు, ఆధార్ కార్డును పరిశీలించాలని కలెక్టర్ సిబ్బందికి సూచించారు. రేషన్ కార్డు లో తప్పనిసరిగా లబ్ధిదారుల పేరును ఉండేలా చూడాలని తెలిపారు. అదేవిధంగా సర్వేలో పూర్తిగా సేకరించిన లబ్ధిదారుల వివరాలను యాప్ ద్వారా నమోదు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వే త్వరితగతిన పూర్తయ్యేలా తగిన ప్రణాళికలు రూపొందించాలని సర్వే అధికారులను ఆదేశించారు. నమోదు ప్రక్రియలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే పై అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్, హనుమకొండ జిల్లాల 2 బిహెచ్కెనోడల్ అధికారులు రాజేందర్, జి రామ్ రెడ్డి , తహసిల్దార్ జగన్మోహన్ రెడ్డి , మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్, ఆర్ ఐ సునీల్, ఆర్ ఓ శ్రీనివాస్, సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# స్మార్ట్ సిటి అభివృద్ధిలో భాగంగ నిదులు విడుదల

- ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

**హసన్ పర్తి,తెలంగాణ ముచ్చట్లు:**
భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో హసన్‌పర్తి అంబేద్కర్ కాలనీలో ప్రదాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జిడబ్ల్యుఎంసి కార్పోరేటర్ గురుమూర్తి శివకుమార్ హాజరై మాట్లాడుతూ భారత ప్రదాని నరేంద్రమోదీ దేశంలో గల గ్రామీన,పట్టణ ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా కేంద్రం నుండి హసన్‌పర్తి 66వ డివిజన్ అభివృద్ధికి 5 కోట్ల 80 లక్షల నిదులను మంజూరు చేయడం చాలా సంతోషకరమైన విషయమని అన్నారు.
మాజీ శాసనసభ్యులు ఆరూరి రమేష్ గతంలో 66వ డివిజన్ అభివృద్ధి పనులు సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీల నిర్మాణాలు,వీదీ లైట్ల ఏర్పాట్ల గూరించి పూర్తి నిర్మాణాత్మకమైన పనులని కేంద్రప్రభుత్వానికి తెలియజేడం పట్ల కృతజ్ఞతలు తెలుపుతూ అదేవిధంగా నగర మేయర్ గుండు సుధారాణి, కమీషనర్ అశ్వినీ తనాజె ఐఏఎస్,వర్దన్నపేట శాసనసభ్యుడు కే.ఆర్ నాగరాజు లకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటసి పిట్టల కుమారస్వామి,భాజపా రైల్వే బోర్డు మెంబర్స్ మేకల హరిశంకర్,దాసరి రాజు, తాళ్ల రమేష్,ప్రదాన కార్యదర్శి మట్టెడ సుమన్,భాజపా హనుమకొండ జిల్లా దళిత మోర్చ కార్యదర్శి దాట్ల సునిల్,డివిజన్ కార్యదర్శి ఇమ్మడి కరుణాకర్,డివిజన్ యువమోర్చ అధ్యక్షుడు కుంభార్కర్ సాయి కిరణ్, గంట సత్యం,గంట వెంకట్ రెడ్డి,చకిలం రాజేశ్వర రావు,గరిగె మాదవి,పెద్దమ్మ శ్రీనివాస్,దాది మధుసుదన్,కందుకూరి శ్రీ కాంత్,ఇమ్మడి యుగేందర్(బోస్)శీలం భిక్షపతి,వెంగళ శ్రీనివాస్,ఎస్.టి రాజు,పెద్దమ్మ కుమారస్వామి, గోడిశాల శివకృష్ణ,నంద రవితేజ తదితరులు పాల్గొన్నారు.



# అమిత్ షా ను డిస్మిస్ చేయాలంటూ కాజీపేట లో నిరసన

**ఖాజీపేట్ తెలంగాణ ముచ్చట్లు**
డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ పై కేంద్ర మంత్రి అమిత్ షాను మంత్రి వర్గం నుండి వెంటనే డిస్మిస్ చేయాలని కోరుతూ కాజిపేట్ చౌరస్తాలో తేజోమై మాల కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి అమిత్ షా పార్లమెంట్ లో దేశ ప్రజలను ఉద్దేశించి క్షమాపణ చెప్పి తీరాలని సంఘం తరఫున వారు డిమాండ్ చేశారు. అనంతరం పోలీసుల జోక్యంతో నిరసన కార్యక్రమాన్ని విరమించారు. ఈ కార్యక్రమంలో తేజో మై మాల కుల సంక్షేమ సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




# పారిశుద్ధ్య కార్మికులకు బట్టలు పంపిణీ చేసిన పాస్టర్ దుబ్బాసి జాషువా

**ఖాజీపేట్ తెలంగాణ ముచ్చట్లు**
క్రిస్మస్ పండుగ సందర్భంగా 47 వ డివిజన్ లో పాస్టర్ జాషువా మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు బట్టలు, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాషువా మాట్లాడుతూ ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రపంచ మానవాళికి ఏసుక్రీస్తు జన్మ ఒక రక్షణ అని దేవుని మాటలు అక్కర గల వానికి పంచిపెట్టుట కొరకు అనే దేవుని మాటల ద్వారా పేదవారి కొరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడ0 జరిగిందన్నారు. అనంతరం టిఆర్ఎస్ పార్టీ అర్బన్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి గబ్బెట శ్రీనివాస్ మాట్లాడుతూ పాస్టర్ దుబ్బాసి జాషువా క్రిస్మస్ పండుగ సందర్భంగా పరిశుద్ధ కార్మికులకు బట్టలు పంపిణీ చేయడంతో పాటు సేవా కార్యక్రమాలను నిర్వహించడం ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన గత 12 సంవత్సరాల నుండి అనేక ప్రాంతాలలో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ జవాన్ అరికెళ్ల వెంకటస్వామి, చిట్యాల మహేష్, కాలేశ్వరం మునినాథ్, గోల్కొండ రామ, మాతంగి రజిని, విజయ, దుప్పటి శాంత తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి కి కృతజ్ఞతలు తెలిపిన కడియం

**స్టేషన్ ఘనపూర్, తెలంగాణ ముచ్చట్లు**
స్టేషన్ ఘనపూర్ ప్రజల చిరకాల కోరికను నెరవేర్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం రోజు అసెంబ్లీ సమావేశాలలో భాగంగా మున్సిపల్ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అసెంబ్లీ వేదికగా స్టేషన్ ఘనపూర్ గ్రామాన్ని మున్సిపాలిటీగా అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సహకారంతో స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి అత్యధిక నిధులు తీసుకువచ్చి స్టేషన్ ఘనపూర్ రూపు రేఖలు మార్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ అభివృద్ధికి అడిగిన వెంటనే కాదనకుండా నిధులు కేటాయిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఎమ్మెల్యే



కడియం శ్రీహరి మరోసారి ధన్యవాదములు తెలిపారు.



# అమిత్ షా దిష్టిబొమ్మ దహనం

**స్టేషన్ ఘనపూర్ తెలంగాణ ముచ్చట్లు**
హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలో డిహెచ్పిఎస్ మండల కార్యదర్శి రాజారపు రత్నం ఆధ్వర్యంలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా కార్యదర్శి రెంటాల దేవా సీనియర్ నాయకులు బట్టు మల్లయ్య పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఒక ఉన్నతమైన పదవిలో ఉండి రాజ్యాంగాన్ని అంబేద్కర్ ని పలుమార్లు అవమానించడం సరైన పద్ధతి కాదని రాబోయే రోజులలో తగిన గుణపాఠం చెప్తామని బిజెపి నాయకులను హెచ్చరించారు. హోం మంత్రిగా ఉండి అంబేద్కర్ ని అవమానించినందుకు దేశ ప్రజలకు అంబేద్కర్ కి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో ఈ పోరాటాలు ఈ తెలంగాణ రాష్ట్రాల్లో ఉదృతం చేస్తామని హెచ్చరించారు బిజెపి మతోన్మాద రాజకీయ నాయకుల్లారా ఇప్పటికైనా కళ్లు తెరిచి మత పిచ్చిలో ఉండకుండా ప్రపంచ దేశాలలో గౌరవించబడుతున్న మన భారత రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ని అవమానించడం సరికాదని వారు హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో కొట్టే వెంకటేష్ ధర్మసాగర్ మండల సహకార దర్శి రాజారపు దేవన్న హసన్పర్తి మండల ఉపాధ్యక్షులు బోడిగే కమలాకర్ కొట్టే ప్రభాకర్ రాజారపు శీను జకరయ్య డిహెచ్పిఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు



# డిప్లొమో ఫలితాలలో 100%ఉత్తీర్ణతతో విజయ దుంధుబి మ్రోగించిన దరిపల్లి కళాశాల

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
శుక్రవారం విడుదల చేసిన పాలిటెక్నిక్ ఇంజనీరింగ్ డిప్లొమో ఫలితాలలో దరిపల్లి అనంతరాములు కళాశాల డిప్లొమ విద్యార్థిని విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించినారు. సి.ఎస్.సి బ్రాంచ్ నందు పి.స్పందన, మైనింగ్ బ్రాంచ్ నందు షేక్ అమీర్ పాషా, సివిల్ బ్రాంచ్ నందు హీనా హర్షద్, డిప్లమో మొదటి సంవత్సరం ఇంటర్నల్ ఎగ్జామినేషన్ లో మహమ్మద్ బురానిద్దీన్ కళాశాల నుంచి మొదటి వరుసలో నిలిచారు.
డిప్లొమలో జాయిన్ అయిన సామాన్య విద్యార్థిని విద్యార్థులకు నూరు శాతం ఉత్తమ ఫలితాలు సాధించినందుకు కళాశాల అధినేత మరియు ప్రిన్సిపాల్ డాక్టర్ దరిపల్లి కిరణ్ హర్షం వ్యక్తం చేస్తూ ఈ ఘనత సాధించిన డిప్లొమ విద్యార్థిని విద్యార్థులకు, వారి తల్లితండ్రులకు, కళాశాల అకాడమిక్ ఇంచార్జ్, బోధన, బోధనేతర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



# ఇరుముడి కార్యక్రమములో పాల్గొన్న డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
కారేపల్లి మండలం గిద్దవారిగూడెంలో ఆంజనేయ స్వామి గుడి ఆవరణలో అయ్యప్ప స్వామి ఇరుముడి కార్యక్రమం మండ్రు పుల్లయ్య గురుస్వామి, కేలోత్ రవి గురు స్వామి ల సమక్షంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్ పాల్గొని స్వాములందరకు పూలమాలలు వేసి ఘనంగా సత్కరిం చారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములను ఉద్దేశించి వారు మాట్లాడుతూ నలభై రోజులు కఠినదీక్షతో ఏకభుక్తం తో, కటిక నేలపై పడుకుని, పాదరక్షలు లేకుండా తమ వృత్తి ధర్మాన్ని మరువకుండా ఉండి శబరిమలై యాత్రకు బయలుదేరుతున్న సందర్భంగా అందరికీ, అయ్యప్ప స్వామి ఆశీస్సులు అందరికీ ఉండాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేగల ఉపేందర్, బొబ్బలు ఉపేందర్,గోపికృష్ణ గురు స్వామి, దేగల కృష్ణ గడ్డమీది లింగయ్య, కన్నబోయిన ఉపేందర్ రామారావు శేఖర్ వెంకటేష్, రాము నవీన్ వినోద్ రాజేష్ గణేష్ లోకేష్ ఆదినారాయణ నవీన్ కృష్ణమూర్తి నగేష్ రాము మరియు అయ్యప్ప స్వాముల బంధువులు మరియు తదితరులు పాల్గొన్నారు



# అమిత్ షా పదవికి వెంటనే రాజీనామ చేయాలి

- మాల మహానాడు మండల అధ్యక్షుడు పోతురాజు ప్రభాకర్

**హసన్ పర్తి,తెలంగాణ ముచ్చట్లు:**
కేంద్ర హోం శాఖామంత్రి అమిత్ షా పార్లమెంటు లో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యల పై మాల మహానాడు అధ్యక్షుడు పోతురాజు ప్రభాకర్ అద్యక్షతన హసన్ పర్తి బస్టాండ్ సెంటర్ లో గల అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాల మహానాడు మండల అధ్యక్షుడు మాట్లాడుతూ పార్లమెంటు లో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ను అవహేళన చేస్తూ మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్ షా పై ఎస్సీ, ఎస్టీ యాక్టు కేసు పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పోతురాజు చుక్క ప్రభాకర్, పోతురాజు మల్లికార్జున్, కనకం మనోహర్,పోతురాజు జ్ఞానేశ్వర్,,పోతురాజు నగేష్,గరిగె రాజు,గరిగె వేణు,,పోతురాజు కుమారస్వామి,,పోతురాజు రాజు, కనకం వంశీ,గిద్ద స్వామి తదితరులు పాల్గొన్నారు.

# మంచులో అదుపుతప్పిన కారు ప్రమాదంలో తెలంగాణ యువకుడి మృతి

**తెలంగాణ ముచ్చట్లు**
నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని గౌడ్స్ కాలనీకి చెందిన పంజాల నీరజ్ గౌడ్ (23) అనే యువకుడు అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఘటనలో జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మ గుట్టకు చెందిన శ్రీధర్ అనే విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. సంవత్సరంన్నర క్రితం వీరిద్దరు ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి న్యూహెవెన్ సిటీలో ఉంటూ విద్యనభ్యసిస్తున్నారు.
**మంచులో కారు అదుపుతప్పడంతో ప్రమాదం :** ఈ నెల 16న బ్రిడ్జిపోర్టు ప్రాంతానికి వెళ్లి కారులో తిరిగి వస్తుండగా తీవ్రంగా మంచు కురుస్తుండడంతో కారు అదుపుతప్పి పక్కనే ఉన్న పోలీసు పెట్రోలింగ్ కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన నీరజ్ గౌడ్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. శ్రీధర్‌కు తీవ్ర గాయాలయ్యాయి.



అమెరికా పెట్రోలింగ్ పోలీసు కారులోని సిబ్బందికి సైతం తీవ్ర గాయాలయ్యాయి. మరో ఐదు నిమిషాల్లో వీరు నివాసం ఉండే రూమ్ కు చేరుకునే సమీపంలో ప్రమాదం చోటు చేసుకోవడం ఇరు కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. బోధన్‌కు చెందిన పంజాల నీరజ్ గౌడ్ తండ్రి శంకర్ గౌడ్ నెల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. మృతదేహన్ని స్వదేశానికి రప్పించడానికి ప్రయత్నాలు చేస్తున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు.



# అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ గా భాధ్యతలు స్వీకరించిన చంద్రకళ

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
పోలీస్ కమిషనర్ కార్యాలయం ఏవో (అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్) గా బి.చంద్రకళ శుక్రవారం భాధ్యతలు స్వీకరించారు. ఆనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వరంగల్ కమిషనరేట్ సెక్షన్ సూపరిండెంట్ గా భాధ్యతలు నిర్వహిస్తూ...ఏవో గా పదోన్నతిపై ఖమ్మం పోలీస్ కమిషనరెట్ కు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఖమ్మం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో భాధ్యతలు చేపట్టారు. ఆనంతరం అడిషనల్ డీసీపీ ఆడ్మీన్ నరేష్ కుమార్, అడిషనల్ డీసీపీ లా& ఆర్డర్ ప్రసాద్ రావు ని మర్యాద పూర్వకంగా కలిశారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక





# మొదటి రోజు విజయవంతమైన ద్యానోత్సవం

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

కూసుమంచి మండల కేంద్రంలోని ఎస్సార్ ఫంక్షన్ హాల్ లో మూడు రోజుల ధ్యాన ఉత్సవం శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మొదటిరోజున ద్యానోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కూసుపంచి మాజీ సర్పంచ్ చెన్న మోహన్ రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచితంగా కుసుమంచి ప్రజానీకానికి ఇంత మంచి కార్యక్రమం అందజేస్తున్న హార్ట్ ఫుల్ నెస్ సంస్థ వారిని అభినందించారు. మిగతా రెండు రోజులు జరుగు ధ్యాన ఉత్సవం కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రజలందరూ దీనిని వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఖమ్మం హార్ట్ ఫుల్ నెస్ కోఆర్డినేటర్ టి నరసింహా చారి మాట్లాడుతూ సమగ్ర ఆరోగ్యానికి ద్యానం యొక్క ఆవశ్యకతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హార్ట్ ఫుల్ నెస్ ట్రైనర్స్ ఏ నరేందర్, కె అనురాధ, ఎన్ కరుణాకర్, వేల్లంపల్లి రాజేంద్రప్రసాద్, ఎం కవిత, బి జ్యోతి, పి అరుణ, మోహన్ మురళీ, గ్రామ పెద్దలు భారీ భద్రం, బోనగిరి రాజేంద్రప్రసాద్, అద్దంకి ఉపేంద్ర చారి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

- **లబ్ధిదారులకు అందజేసిన కాంగ్రెస్ నేతలు కొప్పుల చంద్రశేఖర్, బొర్రా రాజశేఖర్**
- **54మందికి రూ.13.81 లక్షల మేరకు లబ్ధి**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

ప్రైవేటు, కార్పొరేట్ హాస్పిటళ్లలో చికిత్స పొందిన పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీ ఎంఆర్ఎఫ్) చెక్కులను శుక్రవారం ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నేతలు అందజేశారు. నగరంలోని గట్టయ్య సెంటర్లో గల క్యాంప్ ఆఫీసులో 54 మంది లబ్ధిదారులకు కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్, బొర్రా రాజశేఖర్ పంపిణీ చేశారు. తద్వారా మొత్తం రూ. 13లక్షల 81,500 మేరకు లబ్ధి చేకూరింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు కొప్పుల చంద్రశేఖర్, బొర్రా రాజశేఖర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పేదల పక్షాన నిలుస్తోందని తెలిపారు. అర్హులందరికీ లబ్ధి చేకూరుస్తోందని, ఆపత్కాలంలో అండగా నిలుస్తోందని అన్నారు. ఆరోగ్య భరోసానందిస్తూ.. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను.. సకాలంలో లబ్ధిదారులకు అందేలా చూస్తోందని చెప్పారు. ఇందిరమ్మ రాజ్యంలో అన్ని వర్గాల ప్రజలకు.. మేలు జరుగుతుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో.. కాంగ్రెస్ ఏన్కూరు మండలాధ్యక్షులు స్వర్ణ నరేందర్, కూసుమంచి మండలాధ్యక్షులు మట్టె గురవయ్య, నాయకులు కోసూరి శ్రీను, స్ఫూర్తి ఓం రాధాకృష్ణ, మైనారిటీ నాయకులు ఇమామ్ భాయ్, చల్లా రామకృష్ణారెడ్డి, కన్నెబోయిన సీతారాములు, రాయల పుల్లయ్య, మోషే, ఎయిర్టెల్ నరసింహారావు, కాంపాటి రమేష్, బోడ శ్రావణ్, సురేష్ నాయక్, ఇమ్మడి తిరుపతిరావు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా శ్రీశ్రీశ్రీ కోమటోళ్ళ మైసమ్మ దేవాలయ దశమ వార్షికోత్సవ మహోత్సవాలు

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామం జాతీయ రహదారి 44 దగ్గర ఉన్నటువంటి శ్రీశ్రీశ్రీ కొమటోళ్ల మైసమ్మ దేవాలయ దశమ వార్షికోత్సవ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. శుక్రవారం 400 కేవి విద్యుత్ సబ్స్టేషన్ అధికారుల ఆధ్వర్యంలో మైసమ్మ దేవాలయ దశమ వార్షికోత్సవ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మైసమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దశమ వార్షికోత్సవం సందర్భంగా గ్రామానికి చెందిన ఆర్ పెద్ద శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీనివాసరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. వార్షికోత్సవ పూజలో భాగంగా అభిషేకాలు, కుంకుమార్చనలు, మహాపూర్ణహుతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు, విద్యుత్ అధికారులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని భక్తులు, విద్యుత్ అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇండ్ల యాప్ సర్వే త్వరగా పూర్తి చేయాలి

- **వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి ,తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇంట్లో సర్వే లో తప్పులు లేకుండా చూసుకోవాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి ఆదేశించారు. శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రం బసవన్న గడ్డ వనపర్తి శివారు రాజనగరం వడ్డేగేరి లో జరుగుచున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఆకస్మిగంగా తనిఖీ చేశారు. ఒక్క సర్వే రోజు 25 పూర్తి చేయాలని ఆన్లైన్ లో డేటా ఎప్పటికప్పుడు నమోదు చేయాలని. తప్పులు చేయవద్దు అని సర్వే చేసేటప్పుడు కుటుంబ సభ్యుల వివరాలు ఏమైనా తప్పులు ఉంటే సరి చేయాలని చెప్పారు. యాప్ లో ఏమైనా సాంకేతిక సమస్యలు ఉంటే అధికారులకు తెలియజేయాలని సూచించారు.

## నేడు..జిల్లాలో ఎంపీ రఘురాం రెడ్డి పర్యటన

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**



ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి జిల్లాలో శనివారం పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి బయలుదేరి ఉదయం 9 గంటలకు కల్లూరు చేరుకుంటారు. అక్కడ ఎంపీడీవో కార్యాలయ ఆవరణ లో ఇందిరమ్మ పథకం మోడల్ (నమూనా ) గృహ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ తర్వాత జిల్లాలో పలు ప్రైవేట్ కార్యక్రమాలకు హాజరవుతారు. ఈ మేరకు ఎంపీ క్యాంప్ కార్యాలయం నుంచి శుక్రవారం రాత్రి ఓ ప్రకటన వెలువడింది.`



## హర్యానా మాజీ సీఎం ఓం ప్రకాశ్ చౌతాలా మృతి పట్ల మాజీ ఎంపీ నామ విచారం

- **రైతుల పక్షపాతి మాజీ సీఎం ఓం ప్రకాశ్ చౌతాలా**
- **మాజీ ఎంపీ నామ**

**ఖమ్మం బ్యూరో,తెలంగాణ ముచ్చట్లు:**



భారత 6వ ఉప ప్రధాని చౌదరి దేవి లాల్ కుమారుడు ఇండియన్ నేషనల్ లోక్ దళ్ అధ్యక్షుడు, హర్యానా మాజీ ముఖ్యమంత్రి ఓం ప్రకాశ్ చౌతాలా మృతిపట్ల బిఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ విచారం వ్యక్తం చేసారు. శుక్రవారం గురుగ్రామ్‌లో ఓం ప్రకాష్ చౌతాలా గుండెపోటుతో తుదిశ్వాస విడిచారని ఆయన తన జీవింతాంతం రాష్ట్రానికి, ప్రజలకు సేవ చేశారు వారి మరణం తీరని లోట అని అన్నారు. ఓం ప్రకాశ్ చౌతాలా మంచి వ్యక్తి అని 1989 నుండి 2005 వరకు హర్యానాకు ముఖ్యమంత్రిగా పని చేసారన్నారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని నామ గుర్తు చేసుకుంటూ ఆయన రైతుల పక్షపాతి అన్నారు. 15వ లోక్ సభ లో నామ టీడీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా ఉన్న సమయాన పలుమార్లు వారి తండ్రి చౌదరి దేవి లాల్ జయంతి వేడుకుల్లో పాల్గొనడం జరిగిందని, ఆ సభల్లో రైతులు భారీగా పాల్గొనేవారని నామ పేర్కొన్నారు. వారి కుటుంబం నుండి దాదాపు మూడు తరాల వారు ప్రజాసేవ లోనే వున్నారని ఇప్పుడు నాల్గో తరం ఓం ప్రకాష్ చౌతాలా మనవడు, దుష్యంత్ చౌతాలా, జననాయక్ జనతా పార్టీ నాయకుడు, హర్యానా ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారన్నారు. ఓం ప్రకాశ్ చౌతాలా ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు నామ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు

## ఈవిఎం గోడౌన్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**ఖమ్మం బ్యూరో,తెలంగాణ ముచ్చట్లు :**

త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో గల ఈవిఎం గోడౌన్ ను శుక్రవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గాల వారీగా ఉన్న బ్యాలెట్, కంట్రోల్ యూనిట్ లు భద్రపరిచిన గదులను, మొదటి అంతస్తులో భద్రపరిచిన వి.వి. ప్యాట్ గది సీల్ ను రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారుల సమక్షంలో గదులకు ఉన్న సీల్ ను చూసి ఓపెన్ చేసి పరిశీలించారు. అనంతరం అందరి సమక్షంలో తిరిగి సీల్ వేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈవిఎం గదులలో ఎక్సాస్ట్ ఫ్యాన్ ఉన్న ప్రదేశంలో బయటి వైపు మెస్ జాలి ఏర్పాటు చేయాలని, ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల్లో చెత్త చేరకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. సంబంధిత రిజిస్టర్ లను పరిశీలించి తనిఖీ రిజిస్టర్ లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. జిల్లా కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సిహెచ్. స్వామి, కలెక్టరేట్ ఎన్నికల డిటి అన్సారీ, అగ్నిమాపక శాఖ అధికారి నాగరాజు, రాజకీయ పార్టీ ప్రతినిధులు ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి పి. శ్రీనివాస్, బిజేపి పార్టీ ప్రతినిధి జి. విద్యాసాగర్, సి.పి.ఎం. పార్టీ ప్రతినిధి ప్రభాకర్, బి.ఆర్.ఎస్. పార్టీ ప్రతినిధి కె. ఉమా శంకర్, టి.డి.పి. పార్టీ ప్రతినిధి పి. కృష్ణప్రసాద్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి హుస్సేన్,అధికారులు, తదితరులు ఉన్నారు.



## సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ సంపూర్ణ మద్దతు

- **ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు**
- **డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్**
- **సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

శుక్రవారం ఖమ్మం నగర కేంద్రంలోని నూతన కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు 10 రోజులుగా నిర్వహిస్తున్న సమ్మెకు ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ సంపూర్ణ మద్దతును తెలియజేసింది ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బషీరుద్దీన్ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ లో మాట్లాడుతూ సమగ్ర శిక్షలో కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని పేస్కేల్ ఇవ్వాలని కోరుతూ ఉద్యోగులు గత పది రోజులుగా సమ్మె చేస్తున్నారు వారికి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ జిల్లా కమిటీలు సంపూర్ణ మద్దతు ఇస్తుందని అన్నారు. గత 18 సంవత్సరాలుగా 19600 మంది ఉద్యోగులు పనిచేస్తున్నప్పటికీ వారిని రెగ్యులైజ్ చేయకపోవడం కాంగ్రెస్ మేనిఫెస్టో లో వారిని రెగ్యులైజ్ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారు 18 ఏళ్లుగా వారు తక్కువ జీతాలకు పని చేస్తున్నారు కాబట్టి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనం పెంచాలని అన్నారు. జిల్లాస్థాయిలో ఏపీవో సిస్టం అనలిస్టు టెక్నికల్ పర్సనల్ ఆపరేటర్లు డి ఎం ఎం టి మెసెంజర్లు అదేవిధంగా మండల స్థాయిలో ఎమ్మెల్యే కోఆర్డినేటర్లు డేటా ఎంట్రీ ఆపరేటర్లు స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో సీఆర్పీలుగా పాఠశాల స్థాయిలో ఎన్నో ప్రభుత్వ యంత్రాంగంలో పనిచేస్తున్న వారందరినీ రెగ్యులర్ చేయాలని అదేవిధంగా ప్రభుత్వమే ప్రైవేటు వ్యవస్థ లాగా ఉద్యోగుల శ్రమను దోపిడీ చేయడం సిగ్గుచేటని వారికి ఆరోగ్య కార్డులో మహిళలకు ప్రసూతి నెల పలు జీవిత బీమాలు ఇవ్వాలని అన్నారు వీటన్నింటిని సమస్యల పైన ప్రభుత్వానికి ఎన్ని విజ్ఞప్తులు చేసినా పట్టించుకోకపోవడంతో వారు నిరోధిక సమ్మెకు దిగి ఆందోళన చేస్తున్నప్పటికీ కూడా ప్రభుత్వ స్పందించకపోవడం చాలా దుర్మార్గమని వారు అన్నారు ఇప్పటికైనా టిఆర్ఎస్ ప్రభుత్వం వలే కాకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించి వారు కోరుకుంటున్న అటువంటి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి కేజీబీవీ విద్యాసంస్థల్లో పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు చదువు అందేలా చూడాలని వారు తెలియజేశారు లేని పక్షంలో వారికి అండగా ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ ఉంటూ పెద్ద ఎత్తున పోరాటాలు ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల రమేష్ డివైఎఫ్ఐ జిల్లా నాయకులు జక్కంపూడి కృష్ణ ఎస్ఎఫ్ఐ నాయకులు మనోజ్, త్రినాథ్ ,ఉదయ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఇన్ఫోసిస్ సంస్థను సందర్శించిన యస్.బి.ఐ.టి. విద్యార్థులు

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

ప్రముఖ బహుళజాతి సాఫ్ట్వేర్ సంస్థ ఇన్ఫోసిస్ ను తమ కళాశాల మొదటి సంవత్సరం సి.యస్.ఈ. విద్యార్థులు సందర్శించినట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ లోని పోచారం క్యాంపస్ ను సందర్శించి సాఫ్ట్వేర్ రంగంలో పనితీరును విద్యార్థులు అర్థం చేసుకునేలా సంస్థ ప్రతినిధులు ప్రెజెంటేషన్ ఇచ్చారని తద్వారా సాఫ్ట్వేర్ ప్రాజెక్టుల డెవలప్మెంట్ మరియు టెస్టింగ్ పై అవగాహన కలుగుతుందని వారు తెలిపారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) మరియు ఇన్ఫోసిస్ వారి సంయుక్త ఆధ్వర్యంలో తమ కళాశాల విద్యార్థులకు ఈ అవకాశం దొరికిందని, గత సంవత్సరం తాము ఇన్ఫోసిస్ తో చేసుకున్న అవగాహనా ఒప్పందం ఇందుకు దోహదపడింది అని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి తెలిపారు. ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డ్ ద్వారా తమ విద్యార్థులకు ఉచితంగా పలు ఆధునిక కోర్సులు అందించగలిగాం అని వారు తెలిపారు. ఇన్ఫోసిస్ సంస్థకు, టాస్క్ స్టేట్ హెడ్ దినేష్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ మరియు జనరేటివ్ ఏ ఐ వంటి అడ్వాన్స్డ్ ప్రాజెక్ట్ పై ఇన్ఫోసిస్ ప్రతినిధుల ప్రెజెంటేషన్ తమ విద్యార్థుల ఆలోచనలను మార్చాయని, రానున్న రోజులలో సంస్థ చేపట్టనున్న ప్రాజెక్ట్స్ ఆసక్తిని కలిగించాయని కళాశాల ప్రిన్సిపల్ డా॥ జి. రాజ్ కుమార్ తెలిపారు. మొదటి సంవత్సరం నుండే విద్యార్థులు తమ ఆలోచనలకు పదును పెట్టించడం ద్వారా భవిష్యత్తులో సమాజ హితమైన ప్రాజెక్ట్ చూడగలమని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఇన్ఫోసిస్ సంస్థ రిలేషన్షిప్ మేనేజర్ నివాస్, సిమ్రాన్ తో పాటు కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా॥ ఎ.వి.వి. శివ ప్రసాద్, డా|| జె. రవీంద్రబాబు, డా॥ యస్. శ్రీనివాసరావు, టి.పి.ఒ. యన్. సవిత, కోఆర్డినేటర్ జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య ఆరోగ్యశాఖలో డాక్టర్ల నీయమాకం కొరకు దరఖాస్తుల ఆహ్వానం

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో,తెలంగాణ ముచ్చట్లు:**



వైద్య మరియు ఆరోగ్య విభాగం జాతీయ ఆరోగ్య మిషన్ నందు ఆళ్లపల్లి మరియు దమ్మపేట మాతా శిశు ఆరోగ్య,ఎపిడమిక్ బృందంలో వైద్యాధికారి ఖాళీలను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయుటకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్హతలు ఎంబిబిఎస్ పట్టభద్రులై,మెడికల్ కౌన్సిల్ లో నమోదు చేసుకొని ఉండాలని, అభ్యర్థి వయస్సు 31 జూలై 2024 నాటికి 44 సంవత్సరాల లోపు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఏజెన్సీ ఏరియా గిరిజన అభ్యర్థులకు మరియు గతంలో గిరిజన ప్రాంతంలో పనిచేసిన అనుభవం గల వారికి నియామకంలో మొదటి ప్రాధాన్యత ఇవ్వబడునని, నియామకం ఒక సంవత్సరం కాంట్రాక్టు పద్ధతి పై తీసుకోవడం జరుగుతుందని అన్నారు. వైద్యాధికారి నెలసరి వేతనం 52,000 వరకు ఉంటుందని 23 సంవత్సరాల నుండి 44 సంవత్సరాలలోపు వరకు వయసు ఉండాలని, చర్ల,ఆళ్లపల్లి మండలాల్లో పనిచేయవలసి ఉంటుందని అన్నారు.కావున ఆసక్తి గల అభ్యర్థులు తమ జిరాక్స్ సర్టిఫికెట్ తో జతపరిచిన దరఖాస్తులను ఈ నెల 20 నుండి 27 సాయంత్రం 5 గంటలలోపు ఐటీడీఏ భద్రాచలం ప్రాంగణంలో గల అదనపు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం లో అందజేయవలసినదిగా ఆయన తెలియజేశారు. గడువు తర్వాత వచ్చిన దరఖాస్తులు అంగీకరించబడవని ఆయన అన్నారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
శనివారం 21 –12–2024




# 'పిల్లి' ఎంగిలి చేసిన పిండితో 'పరోటాలు'

తెలంగాణ ముచ్చట్లు

పిల్లి ఎంగిలి చేసిన పిండితో పరోటాలు చేసి ప్రజలకు విక్రయించిన ఘటన దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని అహ్మద్‌గూడలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ జిల్లా కీసర మండలం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని అహమ్మద్‌గూడ ఎస్ఆర్ పరోటా సెంటర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. రద్దీగా ఉండే ఎస్ఆర్ పరోటా సెంటర్‌కు కొంతమంది వినియోగదారులు తినడానికి వచ్చారు. ఈ క్రమంలో ఫుడ్ ఆర్డర్ చేసి బయట వెయిట్ చేస్తున్న సమయంలో అనుకోకుండా ఓ పిల్లి వచ్చి పరోటా పిండిని ఎంగిలి చేసింది. ఆహార భద్రత లేకపోవడంతోనే : ఇది గమనించిన ఆ ఫుడ్ కస్టమర్స్, పిల్లి పరోటా పిండిని ఎంగిలి చేస్తున్న దృశ్యాలను తమ మొబైల్ ఫోన్ రికార్డు చేశారు. అనంతరం సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయగా ప్రస్తుతం వైరల్ అవుతోంది. పరోటా సెంటర్‌లోని మాస్టర్ చెఫ్ ఆహార భద్రత పాటించకుండా నిర్లక్ష్యంగా ఉండడంతోనే పిల్లి దర్జాగా వచ్చి ఆ పిండిని ఎంగిలి చేసిందని వినియోగదారులు మండిపడుతున్నారు. కాగా ఈ ఘటన వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ఫుడ్ సేఫ్టీ అధికారులపై విమర్శలు చేస్తున్నారు.

| S. No | T. No. | From | To | Days of run | Cancellation Dates | |
|---|---|---|---|---|---|---|
| | | | | | From | To |
| 1 | 07760 | Secunderabad | Chittapur | Daily | 21.12.24 | 28.12.24 |
| 2 | 07759 | Chittapur | Secunderabad | Daily | 22.12.24 | 29.12.24 |
| 3 | 07276 | Kacheguda | Miryalaguda | Daily | 26.12.24 | 28.02.25 |
| 4 | 07277 | Miryalaguda | Nadikude | Daily | 26.12.24 | 28.02.25 |
| 5 | 07973 | Nadikude | Miryalaguda | Daily | 27.12.24 | 01.03.25 |
| 6 | 07974 | Miryalaguda | Kacheguda | Daily | 27.12.24 | 01.03.25 |
| 7 | 07791 | Kacheguda | Nadikude | Mon, Tue, Wed, Thu, Fri, Sun | 26.12.24 | 28.02.25 |
| 8 | 07792 | Nadikude | Kacheguda | Mon, Tue, Wed, Thu, Fri, Sun | 26.12.24 | 28.02.25 |
| 9 | 07789 | Kacheguda | Mahbubnagar | Daily | 26.12.24 | 28.02.25 |
| 10 | 07790 | Mahbubnagar | Kacheguda | Daily | 27.12.24 | 01.03.25 |
| 11 | 07661 | Tirupati | Katpadi | Daily | 26.12.24 | 28.02.25 |
| 12 | 07662 | Katpadi | Tirupati | Daily | 27.12.24 | 01.03.25 |
| 13 | 07581 | Tirupati | Katpadi | Daily | 27.12.24 | 01.03.25 |
| 14 | 07660 | Katpadi | Tirupati | Daily | 27.12.24 | 01.03.25 |
| 15 | 07659 | Tirupati | Katpadi | Daily | 28.12.24 | 02.03.25 |
| 16 | 07582 | Katpadi | Tirupati | Daily | 28.12.24 | 02.03.25 |
| 17 | 07466 | Rajahmundry | Visakhapatnam | Daily | 26.12.24 | 28.02.25 |
| 18 | 07467 | Visakhapatnam | Rajahmundry | Daily | 27.12.24 | 01.03.25 |
| 19 | 07468 | Visakhapatnam | Vizianagaram | Daily | 26.12.24 | 28.02.25 |
| 20 | 07469 | Vizianagaram | Visakhapatnam | Daily | 27.12.24 | 01.03.25 |
| 21 | 07470 | Visakhapatnam | Palasa | Daily | 27.12.24 | 01.03.25 |
| 22 | 07471 | Palasa | Visakhapatnam | Daily | 27.12.24 | 01.03.25 |
| 23 | 06417 | Katpadi | Jolarpettai | Daily | 28.12.24 | 02.03.25 |
| 24 | 06418 | Jolarpettai | Katpadi | Daily | 28.12.24 | 02.03.25 |

# రైలు ప్రయాణికులకు అలర్ట్

తెలంగాణ ముచ్చట్లు




రైలు ప్రయాణికులకు అలర్ట్. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మీదుగా నడిచే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను రేపటి నుంచి మార్చి 2 వరకు దక్షిణ మధ్య రైల్వే రద్దు చేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వచ్చే 12 గంటల్లో వాయుగుండం బలపడే అవకాశముందన్న సమాచారంతో దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలుగు రాష్ట్రాల మీదుగా నడిచే 24 రైళ్లను రద్దు చేశారు. ఈ మేరకు వాటి వివరాలను సౌత్ సెంట్రల్ రైల్వే వెబ్‌సైట్‌లో అధికారులు ఉంచారు.ఏపీపై వాయుగుండం ప్రభావం : పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది మరో 12 గంటల్లో వాయుగుండంగా బలపడే అవకాశముందని వాతావరణ అధికారులు చెబుతున్నారు. వాయుగుండం ప్రభావంతో ఉత్తరకోస్తా జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపారు. రేపు శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాల్లో తేలిక నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. అల్లూరి, విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో తేలికపాటి చిరు జల్లులు కురిసే అవకాశముందని తెలిపింది.



## హరియాణా మాజీ సీఎం
# ఓం ప్రకాశ్ చౌతాలా కన్నుమూత

తెలంగాణ ముచ్చట్లు

ఇండియన్ నేషనల్ లోక్ దళ్ అధ్యక్షుడు, హరియాణా మాజీ ముఖ్యమంత్రి ఓం ప్రకాశ్ చౌతాలా (89) శుక్రవారం కన్నుమూశారు. గురువారం రాత్రి ఆయనకు గుండె పోటురాగా, ఆయనను వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికీ ఆయనను వైద్యులు రక్షించలేకపోయారని పార్టీ అధికార ప్రతినిధి తెలిపారు.మాజీ ఉపప్రధాని దేవీలాల్ కుమారుడైన ఓం ప్రకాశ్ చౌతాలా హరియాణాకు ఐదు సార్లు (1989 నుంచి 2005 వరకు) ముఖ్యమంత్రిగా పనిచేశారు.

**మోదీ సంతాపం**

హరియాణా మాజీ ముఖ్యమంత్రి ఓం ప్రకాశ్ చౌతాలా మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యలకు తన ప్రగాఢ సంతాపం తెలిపారు."చౌతాలా చాలా ఏళ్లుగా రాష్ట్ర రాజకీయాల్లో చురుగ్గా పని చేశారు. తన తండ్రి దేవీ లాల్ పనులను మరింత ముందుకు తీసుకెళ్లడానికి నిరంతరం కృషి చేశారు" అని ఎక్స్ వేదికగా మోదీ ట్వీట్ చేశారు.

**ఆయన లోటు తీర్చలేనిది!**

ఓం ప్రకాశ్ చౌతాలా మృతిపై హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ ట్వీట్ చేశారు. 'చౌతాలా మరణం చాలా బాధాకరం. ఆయనకు నా నివాళులు. ఆయన తన జీవితాంతం రాష్ట్రానికి, సమాజానికి సేవ చేశారు. ఆయన మరణం రాష్ట్రానికి తీరని లోటు' అన్నారు.నాకు అన్నలాంటివారు!ఓం ప్రకాశ్ చౌతాలా మృతి పట్ల హరియాణా మాజీ సీఎం, కాంగ్రెస్ నేత భూపేంద్ర సింగ్ హుడా తీవ్ర విచారం వ్యక్తం చేశారు."ఓం ప్రకాశ్ చౌతాలా సీఎంగా ఉన్నప్పుడు నేను లోక్‌సభ సభ్యునిగా ఉన్నాను. మా మధ్య మంచి స్నేహ సంబంధం ఉండేది. చౌతాలా ప్రజలకు ఎంతో సేవ చేశారు. ఆయన ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండేవారు. ఆయన ఇంత తొందరగా మనల్ని విడిచి వెళ్లిపోతారని నేను ఊహించలేదు. ఆయన చాలా మంచి వ్యక్తి, నాకు పెద్దన్నయ్య లాంటివారు" అని అన్నారు.

**ఆయన ఆత్మకు శాంతి కలగాలి!**

'ఓం ప్రకాశ్ చౌతాలా మరణవార్త చాలా బాధాకరం. ఆయన హరియాణాకు, దేశానికి ఎంతో సేవ చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నాను' అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ట్వీట్ చేశారు.

## అర్హులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు
# అందేలా చర్యలు చేపట్టాలి...

- అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి
- జిల్లా బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ సమావేశాన్ని నిర్వహించిన అదనపు కలెక్టర్

ఖమ్మం బ్యూరో,తెలంగాణ ముచ్చట్లు:



అర్హులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా బ్యాంకర్లు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశాన్ని అదనపు కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, బ్యాంకులు సకాలంలో ఋణాలు అందించి ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని అన్నారు. 202425 వార్షిక ఋణ ప్రణాళికలో సెప్టెంబర్ 2024 వరకు 2722.66 కోట్లు స్వల్పకాలిక పంట ఋణాలుగా అందచేయడం జరిగిందని, వ్యవసాయ టర్మ్ ఋణాలుగా వ్యవసాయ రంగానికి 1239.55 కోట్లు బ్యాంకుల ద్వారా ఇవ్వడం జరిగిందని తెలిపారు. వ్యవసాయ ఋణాలను సకాలంలో అందించి లక్ష్యాలను సాధించాలని, రైతులు పంట ఋణాలు సకాలంలో చెల్లించేలా అధికారులు క్షేత్ర స్థాయిలో శ్రద్ధ కనబరచాలని అదనపు కలెక్టర్ తెలిపారు. సూక్ష్మ ఋణాల క్రింద సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి పరిశ్రమలకు గాను 1216.65 కోట్లు ఇవ్వడం జరిగిందని, విద్యా ఋణాలుగా 17.53 కోట్లు, గృహ ఋణాలుగా 57.09 కోట్లు అందించడం జరిగిందని ఆయన అన్నారు. ప్రాధాన్యతా రంగాలకు మొత్తంగా 5928.38 కోట్లు అందించడం జరిగిందని తెలిపారు. అప్రధాన్యత రంగాలకు 2265 కోట్లు అందించినట్లు, మొత్తంగా జిల్లాలో 8193.38 కోట్లు సెప్టెంబర్, 2024 మాసము వరకు బ్యాంకుల ద్వారా అందించినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ లబ్దిదారులకు సకాలంలో ఋణాలు అందచేసి లబ్దిదారులకు ప్రయోజనం కల్పించాలని సూచించారు. జిల్లాలో 764 మహిళా సంఘాలకు 202425 సంవత్సరానికి రూ. 11074.30 లక్షల బ్యాంక్ లింకేజీ ఋణాలు ఇప్పటి వరకు అందించామన్నారు. అర్హత ఉన్న సంఘాలకు ఋణాలు వెంటనే అందించాలని, రెన్యువల్ లో ప్రాసెసింగ్ ఫీజు లేకుండా చూడాలని తెలిపారు. పి.ఎం.ఇ.జి.పి., పి.ఎం.ఎఫ్.ఎం.ఇ. ఋణాలు లబ్దిదారులకు సకాలంలో అందించాలని ఆయన సూచించారు. పాడి, మత్స్య పరిశ్రమలకు సంబంధించి లబ్దిదారులకు కిసాన్ క్రెడిట్ ఋణాలు సకాలంలో ఇవ్వాలని తెలిపారు. రిజర్వు బ్యాంకు సూచనల మేరకు నూరు శాతం ప్రజలకు డిజిటల్ సేవలు అందించేలా కృషి చేయాలని, దీనికి బ్యాంకులు ప్రజలకు తెలిసేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అదనపు కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో ఎల్డిఎం శ్రీనివాస రెడ్డి, ఆర్బిఐ ఎల్డిఓ సాయి తేజ రెడ్డి, నాబార్డ్ డిపిఎం సుజిత్ కుమార్, యుబిఐ డిజిఎం హనుమంత రెడ్డి, ఎస్బిఐ సిఎం వెంకటేశ్వర రావు, ఎపిజివిబి సిఎం శ్రీహరి, డిసిసిబి సిఇఓ ఎన్ వి. ఆదిత్య, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, ఇంచార్జ్ ఇడి ఎస్సి కార్పొరేషన్ నవీన్ బాబు, వివిధ శాఖల అధికారులు, బ్యాంకర్లు, తదితరులు పాల్గొన్నారు.



# శిశువుల్లో జన్యు, జీవ రుగ్మతలను ముందస్తుగా గుర్తించండి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో,తెలంగాణ ముచ్చట్లు:

మాతృ,నవజాత శిశువుల సాధారణ వారసత్వ సింగిల్ జీన్ రుగ్మతలు గుర్తించే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ శుక్రవారం మాతృశిశు కేంద్రం రామవరంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని ఆరోగ్య శాఖ సిబ్బందిని ఆదేశించారు. గర్భిణులు మరియు నవజాత శిశువులలో జన్యు మరియు జీవక్రియ రుగ్మతలను ముందస్తుగా గుర్తించడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని ప్రజలకు సూచించారు. గర్భధారణకు ముందు, కాబోయే తల్లిదండ్రులు తమ ఆరోగ్య సంరక్షణ నిపుణులతో జన్యుపరమైన రుగ్మతతో బిడ్డ పుట్టే ప్రమాదం గురించి మాట్లాడి తెలుసుకోవాలని కలెక్టర్ కోరారు. తల్లిదండ్రులు జన్యుపరమైన అసాధారణతల (గర్భధారణకు ముందు జన్యు సలహా) ప్రమాదాల గురించి ఆరోగ్య సంరక్షణ నిపుణులతో మాట్లాడాలి అన్నారు. భావి తల్లిదండ్రులు వారి కుటుంబ చరిత్ర మరియు ఇతర వైద్య చరిత్రను వారి వైద్యుడు లేదా జన్యు సలహాదారుతో సమీక్షించి, వంశపారంపర్య జన్యుపరమైన అసాధారణతతో బిడ్డ పుట్టే ప్రమాదం సగటు కంటే ఎక్కువగా ఉందో లేదో నిర్ధారించవచ్చనన్నారు. ఆ ప్రమాదాలను మరింత ఖచ్చితంగా అంచనా వేయడానికి పరీక్షలు చేయవచ్చు.జన్యు పరీక్షలు ద్వారా, కాబోయే తల్లిదండ్రులకు జన్యుపరమైన అసాధారణత ఉందని చూపిస్తే, దంపతులు మరియు వైద్యుడు ఆ అసాధారణతను పిల్లలకు సంక్రమించకుండా నివారించేందుకు చర్యలు చేపట్టవచ్చు అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా మాతృ,శిశు ఆరోగ్యాధికారి డాక్టర్ భాస్కర్ నాయక్, డాక్టర్ విజయ లక్ష్మి, జన్యు శాస్త్ర సంస్థ & జన్యు రుగ్మతల ఆసుపత్రి, జిల్లా ఆరోగ్య కార్యదర్శి డాక్టర్ రవిబాబు, డా. రాధామోహన్ సూపరింటెండెంట్, ప్రభుత్వ రోగనివారణ కేంద్రం డాక్టర్ బాలాజీ పిల్లల




# ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను పక్కాగా నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా

- వరంగల్ పట్టణంలోని 18వ డివిజన్ లేబర్ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించిన కలెక్టర్.

వరంగల్,తెలంగాణ ముచ్చట్లు:

ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని, లబ్ధిదారుల వివరాలను మొబైల్ యాప్లో నమోదు చేయడంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా సూచించారు.ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను సర్వేయర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి మొబైల్ యాప్లో నమోదు చేస్తున్నారు. శుక్రవారం వరంగల్ పట్టణంలోని 18వ డివిజన్ లేబర్ కాలనీ ప్రాంతంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సర్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఒక్క దరఖాస్తూను వదలకుండా సర్వే చేయాలని ఆదేశించారు. సర్వేపై దరఖాస్తుదారులకు ముందస్తు సమాచారం అందించాలని, ప్రజలు సైతం అవసరమైన డాక్యు మెంట్లను సిద్ధం చేసుకొని సర్వే కోసం వచ్చే ఎన్యూమరేటర్‌లతో సహకరించాలని సూచించారు.ఒక్కో దరఖాస్తుదారుడి వివరాలు నమోదుకు ఎంత సమయం పడుతోంది.. రోజుకు ఎన్ని కుటుంబాల వివరాలు నమోదు చేస్తున్నారు.. సర్వే సందర్భంగా క్షేత్రస్థాయిలో ఏమైన ఇబ్బందులు ఉన్నాయా అని అధికారులను అడిగారు.

ప్రతిరోజు నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు ఎన్యుమరేటర్లు ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తు సర్వే పూర్తి చేయాలని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని.. తప్పిదాలకు తావులేకుండా వివరాలు సేకరించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు సర్వే పారదర్శకంగా జరిగేలా సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ తనిఖీలలో కలెక్టర్ వెంట కార్పొరేటర్ వస్కుల బాబు, జిల్లా పరిషత్ సీఈఓ రామిరెడ్డి, జిడబ్ల్యూ ఎంసీ కాశిబుగ్గ సర్కిల్ రెవిన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## కేటీఆర్ ని అరెస్ట్ చేసి చూడు
# ఏమవుతాదో తెలుస్తది

- ప్రభుత్వాన్ని నిలదీస్తే అక్రమకేసులు పెడతారా
- పాలనపై దృష్టి పెట్టండి కేసులపై కాదు
- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

హనుమకొండ, తెలంగాణ ముచ్చట్లు:

ప్రజా ప్రభుత్వం అంటూ 6 గ్యారంటీలతో ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష నాయకులు ప్రశ్నిస్తే వారిపై కేసులు పెట్టడం హేయమైన చర్య అన్నారు పరకాల మాజీఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి.హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో పాల్గొన్న చల్లా ధర్మారెడ్డి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలన పక్కన పెట్టేసి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే కాళేశ్వరం ప్రాజెక్ట్ లక్ష కోట్ల అవినీతి ఫోన్ టాంపరింగ్ కేసులన్నాడు డ్రగ్స్ అని ఆర్భాటం చేశాడు ఒక్కటి కూడా రుజువు చేయలేక పోయారు.ఇప్పుడు కొత్తగా ఈ కార్ రేస్ లో అవినీతి అని కొత్త డ్రామా మొదలు పెట్టాడు. శుక్రవారం వస్తె కొత్త డ్రామా మొదలు పెట్టి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారు.ఎవరైనా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమకేసులు పెట్టి అరెస్టులు చేయడం తప్ప ప్రజాపాలనపై దృష్టి పెట్టింది లేదు అన్నారు.ఈ కార్ రేస్ లో అవినీతి జరిగితే అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చర్చపెట్టమని అడిగితే దానికి సమాధానం లేక పైగా అసెంబ్లీ సాక్షిగా పేపర్లతో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలపై దాడి చేశారు.ప్రపంచ దేశాలలో జరిగే ఈ కార్ రేసింగ్ ని ఇండియాలో మన హైదరాబాద్ లో జరిగేలా కృషి చేసిన ఘనత కేటీఆర్ దే ప్రపంచపటంలో తెలంగాణలోని హైదరాబాద్ ని నిలబెట్టిన ఘనత కేటీఆర్ దే అన్నారు.కేటీఆర్ నాయకత్వంలో ఐటి,ఇండస్ట్రియల్, ఫార్మా రంగాలు ఎంతో అభివృద్ధి చందాయన్నారు. వేములవాడ రాజన్న సన్నిధిలో మీటింగ్ పెట్టి ఒక్కని ప్లేట్ భోజనానికి రూ.32000/ బిల్లు తో 100 మందికి రూ.32 లక్షల బిల్లు పెట్టారట దానిపైన ఎంక్వైరీ చెయ్యాలన్నారు.ఆరునెలల నుండి ఏదో అక్రమ కేసు పెట్టి కేటీఆర్ ని అక్రమ అరెస్ట్ చేయాలని చూస్తున్న రేవంత్ రెడ్డినీకు దమ్ముంటే కేటీఆర్ ని అరెస్ట్ చేసి చూడు ఏమవుతాదో తెలుస్తది గ్రామాలలో పర్యటించండి అప్పుడు తెలుస్తది మీ పరిస్థితి మీ పార్టీ పరిస్థితి అని హెచ్చరించారు.ఇప్పటికి గురుకుల పాఠశాలల్లో జరుగుతున్న సంఘటనలపై చర్చించే సమయం మీకు లేదు. ఓవర్సీస్ స్కాలర్ షిప్ లో 20 లక్షల సాంక్షన్ చేయడానికి 5 లక్షలు అడుగుతున్నారనట దానిమీద ఎంక్వైరీ చెగ్రామాలలో అభివృద్ధి పనులు చేసిన సర్పంచులకు బిల్లులు ఇవ్వలేదు.వారికి కుటుంబాలు రోడ్డుపైన పడుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే రైతుబంధు పైసలు 7 వేల పొంగులేటి ఇవ్వలేదా పొంగులేటి పై జరిగిన ఈడిదాడులు సంగతి ఏంది ఇప్పటికైనా ప్రశ్నించిన వారిపై కక్ష సాధింపులు ఆపి ప్రజాపాలనపై రాష్ట అభివృద్ధికై దృష్టి సాధించితే మంచిదని హితువు పలికారు.




# ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

కడ్తాల్ తెలంగాణ ముచ్చట్లు:

మారుమూల గ్రామంలోని నిరుపేదలకు వైద్య సేవలు అందించడమే ఉప్పల చారిటేబుల్ ట్రస్టు లక్ష్యమని మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ అన్నారు.శుక్రవారం కడ్తాల మండలం ఎక్వాయిపల్లి గ్రామంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని తెలంగాణ రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ ఉప్పల వెంకటేష్ తనయుడు అనిల్ భావన,డీసీసీబీ జిల్లా డైరెక్టర్ పిఎసిఎస్ చైర్మన్ గంప వెంకటేష్,కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరత్ నాయక్ సీనియర్ నాయకులు జోగు వీరన్న,తో కలిసి ప్రారంభించారు. గ్రామంలో ఉప్పల చారిట్రబుల్ ట్రస్ట్ సహకారంతో జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ ట్రస్ట్,గంప లక్ష్మయ్య గుప్త చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిభిరంలో దాదాపు 334 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందుల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లే వారికి ఈ వైద్య శిభిరం సుర్ణావకాశం అని,అలాగే ప్రైవేట్ దవాఖానలో వేలకు వేల రూపాయలు చెల్లించాలి కానీ ఉచితంగా మందులు ఇవ్వడం గొప్ప విషయం అని కొనియాడారు.అదే విధంగా గ్రామస్థులు ఉప్పల వెంకటేష్,దశరథ్ నాయక్,కి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ముత్యాలు,సత్తయ్య,బిక్షపతి,చంద్రయ్య,సాయిలు, వెంకటరెడ్డి,జంగయ్య,నర్సింహ,వెంకటయ్య,సత్యనరి,శేకర్,జగదీష్,శేకర్,శివ,కృష్ణయ్యఅంజయ్య, వంశీ,శంకర్,శ్రీశైలం,సత్యానారి,గ్రామ పెద్దలు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

## ఎవరూ తగ్గడం లేదుగా!

# అమెరికాలో షట్ డౌన్ తప్పదా?

ఇంటర్నెట్ డెస్క్ ,తెలంగాణ ముచ్చట్లు

ప్రభుత్వ కార్యకలాపాలు, జీతాలకు సంబంధించిన కీలకమైన బిల్లు ఆమోదం పొందని నేపథ్యంలో అమెరికా షట్‌డౌన్ ముప్పును ఎదుర్కొంటోంది. వాస్తవానికి తొలుత బైడెన్ ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లును డొనాల్డ్ ట్రంప్ తిరస్కరించారు. దీంతో ప్రతినిధుల సభ స్పీకర్ మైక్ జాన్సన్ మార్చి 14వ తేదీ వరకు ప్రభుత్వానికి నిధులు సమకూర్చేలా సరికొత్త బిల్లును ప్రవేశపెట్టారు. రెండేళ్లపాటు రుణాలపై సీలింగ్‌ను సస్పెండ్ చేయడం మొదలైన ట్రంప్ డిమాండ్లను ఇందులో చేర్చారు.దీంతో కాబోయే అధ్యక్షుడైన డొనాల్డ్ ట్రంప్ ఈ బిల్లుకు మద్దతు తెలుపుతూ, మిగిలినవారు కూడా సానుకూలంగా ఓటేయాలని పిలుపునిచ్చారు. దీనిని డెమోక్రాట్లు తీవ్రంగా వ్యతిరేకించారు. పైగా ప్రతినిధుల సభ కూడా దీనిని 235174తో తిరస్కరించింది. అంతేకాదు ఏకంగా 38 మంది రిపబ్లికన్ సభ్యులే డెమోక్రాట్లతో కలిసి బిల్లుకు వ్యతిరేకంగా ఓటేశారు. మరోవైపు ప్రస్తుతానికి సెనెట్‌లో డెమోక్రాట్ల పట్టు కొనసాగుతోంది. దీంతో శుక్రవారం రాత్రిలోగా ప్రభుత్వానికి నిధులు సమకూర్చడంలో కాంగ్రెస్ విఫలమైతే అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్ ఎదుర్కోక తప్పని పరిస్థితి నెలకొంది.



**షట్‌డౌన్ ప్రభావం ఎలా ఉంటుందంటే?**

అమెరికాలోని లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులపై షట్‌డౌన్ ప్రభావం పడుతుంది. దాదాపు 8,75,000 మంది ఉద్యోగుల పనులు, జీతాలు నిలిచిపోయే అవకాశం ఉంది. వీరిలో చాలా మందిని పని ప్రదేశంలో రిపోర్టు చేయవద్దని చెబుతారని బైపార్టిసన్ పాలసీ సెంటర్ డైరెక్టర్ అక్బాస్ వెల్లడించారు. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వంటి విభాగాల్లోని మరో 14 లక్షల మంది మాత్రం అత్యవసర సేవలు కొనసాగించాల్సి ఉంటుంది. వీరితో సెలవుల్లో కూడా పని చేయించుకొని చెక్ ఇవ్వరని ది అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ సంఘం పేర్కొంది. షట్‌డౌన్ ముగిశాకే, వారికి పాత వేతనాలు చెల్లింపులు జరుగుతాయని పేర్కొంది. కొన్ని కాంట్రాక్టుల్లో ఈ చెల్లింపులకు ఎలాంటి హామీలు ఉండవని తెలిపింది. అమెరికా శత్రువులకు ఈ షట్‌డౌన్ ఓ క్రిస్మస్ కానుక అవుతుందని అభివర్ణించింది. మరీ ముఖ్యంగా రవాణ శాఖ, ఇతర రంగాలపై ఈ షట్‌డౌన్ ముప్పు ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుందని పేర్కొంది.

**ఏ విభాగాలపై ప్రభావం?**

సోషల్ సెక్యూరిటీ, మెడికేర్ లబ్ధిదారులపై షట్‌డౌన్ ప్రభావం పెద్దగా ఉండదు. వీరికి సంబంధించిన ప్రయోజనాలను కాంగ్రెస్ ప్రత్యేక చట్టం రూపంలో ఆమోదం తెలుపుతుంది. వీటికి వార్షిక చెల్లింపులు అవసరం లేదు. కానీ, సోషల్ సెక్యూరిటీ ఆఫీస్‌లు అందించే ప్రయోజనాలు పరిమితంగా ఉంటాయి. నేషనల్ పార్క్ సర్వీసులు మూతపడతాయి. 2013లో వందలకొద్దీ పార్కులు, మ్యూజియంలు, ఇతర ప్రదేశాలను మూసేశారు. వాస్తవానికి అమెరికాలో షట్‌డౌన్ మొదలైతే, అది ఎంత కాలం కొనసాగుతుందో చెప్పలేము. 201819 మధ్య దాదాపు 35 రోజుల పాటు షట్‌డౌన్ కొనసాగింది. నాడు ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్నారు. అమెరికా చరిత్రలోనే అది సుదీర్ఘమైన షట్‌డౌన్ కావడం గమనార్హం.



## భారత్, అమెరికా రక్షణ సంబంధాలు మరింత స్ట్రాంగ్

ఇంటర్నెట్ డెస్క్ ,తెలంగాణ ముచ్చట్లు

భారత్‌అమెరికా మధ్య ఉన్న రక్షణ సంబంధాలు వేగంగా, ఉత్తేజకరమైన, అద్భుతమైన రీతిలో పురోగమిస్తున్నాయని పెంటగాన్ పేర్కొంది. అమెరికా పగ్గాలు త్వరలో జో బైడెన్ నుంచి ట్రంప్ చేతిలోకి మారనున్న నేపథ్యంలో పెంటగాన్ ఈ కీలక ప్రకటన చేయడం విశేషం."భారత్ అమెరికా మధ్య మంచి రక్షణ సంబంధాలు ఉన్నాయి. ఇది రక్షణ పారిశ్రామిక సహకారంతో పాటు కార్యాచరణ సహకారానికి సంబంధించింది. ఇది అద్భుతమైన, ఉత్తేజకరమైన మార్గాల్లో వేగంగా పురోగమిస్తోంది" అని ఇండో పసిఫిక్ భద్రతా వ్యవహారాల కార్యదర్శి ఎలీ రాట్నర్ ఎలీ రాట్నర్ తెలిపారు. భారత్‌చైనా మధ్య ఉన్న సంబంధాలు క్షీణిస్తున్న నేపథ్యంలో, భారత్‌అమెరికా రక్షణ సంబంధాలు ఎలా ఉన్నాయనే ప్రశ్నకు సమాధానంగా రాట్నర్ కీలక వ్యాఖ్యలు చేశారు.భారత్‌కు అమెరికా అటామిక్ ఎయిర్‌క్రాఫ్ట్స్‌అమెరికా భారత్‌కు 31 జనరల్ అటామిక్ MQ9B (16 స్కై గార్డియన్, 15 సీ గార్డియన్) రిమోట్లీ పైలెటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్‌లను అందించేందుకు వీలుగా అక్టోబర్‌లో ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఇది భారత నిఘా వ్యవస్థ (ఐఎస్ఆర్)ను మరింత బలోపేతం చేయనుంది. ఫలితంగా భారత సాయుధ దళాల సామర్థ్యాలు మరింత మెరుగవనున్నాయి.భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సెప్టెంబర్‌లో సమావేశమై ఇరుదేశాల రక్షణ సంబంధాల గురించి చర్చించారు. అందులో భాగంగా భారత్ అమెరికాలు ఈ సంవత్సరం తమ రక్షణ వస్తువులు, సేవల పరస్పర సరఫరాను పెంపొందించుకునేందుకు వీలుగా 'సెక్యూరిటీ ఆఫ్ సప్లై అరేంజ్‌మెంట్ ను కూడా చేసుకున్నాయి.

**భారత్‌కు చెందిన సంస్థపై అమెరికా ఆంక్షలు**

మరోవైపు భారత్‌కు చెందిన అట్లాంటిక్ నావిగేషన్ ఓపీసీ ప్రైవేట్ లిమిటెడ్‌పై అమెరికా ఆంక్షలు విధించింది. ఇరానియన్ పెట్రోలియం, పెట్రో కెమికల్స్‌తో కలిసి వ్యాపారం చేస్తోందని ఆరోపిస్తూ, భారత దేశానికి చెందిన ఈ సంస్థపై అగ్రరాజ్యం ఆంక్షలు విధించింది. దీంతోపాటు ఇరాన్‌కు బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరుస్తున్న నాలుగు సంస్థలు, మూడు నౌకలపై కూడా ఆంక్షలు విధించినట్లు ట్రెజరీ శాఖ పేర్కొంది. టెహ్రాన్ తన అణు కార్యక్రమాల అభివృద్ధికి, ఆయుధ వ్యవస్థల విస్తరణకు దాని ప్రాక్సీలకు మద్దతు ఇచ్చేందుకు ఈ నౌకలు, కంపెనీలపై ఆధారపడుతోందని వెల్లడించింది.



# దలాల్ స్ట్రీట్ ఢమాల్

ఇంటర్నెట్ డెస్క్ ,తెలంగాణ ముచ్చట్లు

శుక్రవారం దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలతో ముగిశాయి. శుక్రవారం ఒక్కరోజే 1.5 శాతం మేర స్టాక్ మార్కెట్ నష్టపోయింది. దాదాపు అన్ని సెక్టార్లు భారీగా నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు రావడం, విదేశీ పెట్టుబడులు తరలివెళ్తుండడం సహా, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ కీలక వడ్డీ రేట్లు తగ్గించడం మొదలైనవి మార్కెట్లను తీవ్రంగా దెబ్బతీశాయి.

బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 1176 పాయింట్లు నష్టపోయి 78,041 వద్ద స్థిరపడింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజీ సూచీ నిఫ్టీ 364 పాయింట్లు కోల్పోయి 23,587 వద్ద స్థిరపడింది.

**లాభపడిన షేర్లు :** జేఎస్‌డబ్ల్యూ స్టీల్, నెస్లే ఇండియా, ఐసీఐసీఐ బ్యాంక్

**నష్టపోయిన షేర్లు :** టెక్ మహీంద్రా, ఎం అండ్ ఎం, ఇండస్‌ఇండ్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, టాటా మోటార్స్, టీసీఎస్, ఎస్‌బీఐ, ఎల్ అండ్ టీ, రిలయన్స్, అదానీ పోర్ట్స్

**ఆసియా మార్కెట్లు**

ఏసియన్ మార్కెట్లో సియోల్, టోక్యో, హాంకాంగ్, షాంఘై అన్నీ భారీగా నష్టాలను చవిచూశాయి. ప్రస్తుతం యూరోపియన్ మార్కెట్లు అన్నీ నష్టాల్లోనే ట్రేడవుతున్నాయి. గురువారం యూఎస్ మార్కెట్లు నష్టాలతో ముగిసిన విషయం తెలిసిందే.

**విదేశీ పెట్టుబడులు**

స్టాక్ ఎక్స్ఛేంజ్ డేటా ప్రకారం, గురువారం విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు రూ.4,224.92 కోట్లు విలువైన ఈక్విటీలను అమ్మేశారు.

**రూపాయి విలువ**

అంతర్జాతీయ మార్కెట్లో రూపాయి విలువ 10 పైసలు పెరిగింది. ప్రస్తుతం డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.85.03గా ఉంది.

**పెట్రోల్, డీజిల్ ధరలు**

తెలుగు రాష్ట్రాలైన ఏపీ, తెలంగాణలో పెట్రోల్ , డీజిల్ ధరలు స్థిరంగా ఉన్నాయి. హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.107.45గా ఉంది. డీజిల్ ధర రూ.95.63గా ఉంది. విశాఖపట్నంలో లీటర్ పెట్రోల్ ధర రూ.108.27గా ఉంది. డీజిల్ ధర రూ.96.16గా ఉంది. దిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.94.76గా ఉంటే, డీజిల్ ధర రూ.87.66గా ఉంది.

**ముడిచమురు ధరలు**

అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు 0.96 శాతం మేర తగ్గాయి. ప్రస్తుతం బ్యారెల్ క్రూడ్ ఆయిల్ ధర 72.18 డాలర్లుగా ఉంది.



## స్టూడెంట్స్‌కు ఎయిర్ ఇండియా బంపర్ ఆఫర్

ఇంటర్నెట్ డెస్క్ ,తెలంగాణ ముచ్చట్లు

దేశ, విదేశీ పర్యటనలు చేయాలనుకునే విద్యార్థుల కోసం ఎయిర్ ఇండియా స్పెషల్ ఆఫర్స్ ప్రకటించింది. డిసెంబర్ 18 నుంచే ఈ ఆఫర్ అమల్లోకి వచ్చింది. ఎకానమీ, ప్రీమియం ఎకానమీ, బిజినెస్ క్లాస్ ఏదైనా సరే బేస్ ఛార్జీలపై 10 శాతం వరకు డిస్కౌంట్ ఇస్తోంది. అంతేకాదు విద్యార్థులు ఉచితంగా 10 కేజీల వరకు అదనంగా బ్యాగేజ్ తీసుకెళ్లడానికి వీలు కల్పిస్తోంది. కనుక విదేశీ పర్యటనలకు, సాహస యాత్రలకు కావాల్సిన సామగ్రి అంతా తీసుకెళ్లడానికి వీలవుతుంది. అంతేకాదు ఎయిర్ ఇండియా వెబ్‌సైట్ లేదా యాప్ ద్వారా చేసిన బుకింగ్‌లపై కాంప్లిమెంటరీగా ఒకసారి ప్రయాణ తేదీని మార్చుకునే వీలు కల్పిస్తారు.

మీరు భారతదేశం అంతటా తిరగాలని అనుకున్నా లేదా యూఎస్, యూకే, ఆస్ట్రేలియా లాంటి దేశాలకు వెళ్లాలని అనుకున్నా సరే ఎయిర్ ఇండియా విద్యార్థుల కోసం ప్రత్యేకమైన పెర్క్‌లను అందిస్తోంది.

**ఈ బెనిఫిట్స్ కూడా**

ఎయిర్ ఇండియా యాప్ ద్వారా చేసే పేమెంట్స్‌పై అదనపు డిస్కౌంట్స్ కూడా పొందవచ్చు. ముఖ్యంగా డొమెస్టిక్ ఫ్లైట్ టికెట్ బుక్ చేసుకుంటే రూ.399 విలువైన కన్వీనియన్స్ ఫీజు నుంచి మినహాయింపు లభిస్తుంది. అదే అంతర్జాతీయ ప్రయాణాలకైతే రూ.999 వరకు ఫీజు మినహాయింపు దొరుకుతుంది.ఎయిర్ ఇండియా భాగస్వామి బ్యాంకులకు చెందిన యూపీఐ, నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ / డెబిట్ కార్డ్‌ల ద్వారా చేసే చెల్లింపులపై కూడా డిస్కౌంట్స్ లభిస్తాయి. **గుడ్ ఎక్స్‌పీరియన్స్** ఇయిర్ ఇండియా భారతదేశంలోని 49 నగరాలకు, 42 అంతర్జాతీయ డెస్టినేషన్స్‌కు నాన్‌స్టాప్ విమాన సర్వీసులు నడిస్తుంది. కనుక స్వదేశీ, విదేశీ ప్రయాణాలు మీకు మంచి ప్రయాణ అనుభవాన్ని ఇస్తుందని ఎయిర్ ఇండియా చెబుతోంది.


విమానంలో ప్రయాణించేటప్పుడు మీకు ఉచితంగా ఎంటర్‌టైన్‌మెంట్ కల్పిస్తారు లేదా ఎయిర్‌లైన్ విస్తారా స్ట్రీమ్ వైర్‌లెస్ స్ట్రీమింగ్ సేవలను అందిస్తారు. సుదూర విమాన ప్రయాణాలు చేసేటప్పు ఫ్రీ వైఫై కనెక్టివిటీ ఉంటుంది. కనుక ప్రయాణికులు ఎలాంటి అలసట లేకుండా, హాయిగా ఎంజాయ్ చేస్తూ తమ ప్రయాణాన్ని ఆస్వాదించవచ్చని ఎయిర్ ఇండియా చెబుతోంది.

**మహారాజా క్లబ్ రివార్డ్స్ కూడా!**

ఎయిర్ ఇండియా మహారాజా క్లబ్ లాయల్టీ ప్రోగ్రామ్ ద్వారా మరిన్ని బెనిఫిట్స్ అందిస్తోంది. కనుక ఈ ప్రోగ్రామ్‌లో చేరిన వారు ఉచిత టికెట్‌లు, ప్రత్యేకమైన రివార్డ్‌లు, అప్‌గ్రేడ్‌లను పొందవచ్చు. మీరు కనుక ఎయిర్ ఇండియా వెబ్‌సైట్ లేదా యాప్ ద్వారా ఫ్లైట్ టికెట్ బుకింగ్ చేసుకుంటే 33 శాతం అదనంగా రివార్డ్ పాయింట్స్ పొందవచ్చు.

## యుద్ధం ముగించేందుకు సిద్ధం జెలెన్స్కీతో మాత్రం మాట్లాడం

ఇంటర్నెట్ డెస్క్ ,తెలంగాణ ముచ్చట్లు



ఉక్రెయిన్‌తో యుద్ధం ముగించేందుకు సిద్ధంగా ఉన్నామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వెల్లడించారు. ఇందుకోసం ఎవరితోనైనా చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఎలాంటి ముందస్తు షరతులు కూడా పెట్టబోమని చెప్పారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో మాత్రం మాట్లాడే ప్రసక్తి లేదని పుతిన్ స్పష్టం చేశారు. ఆ దేశ పార్లమెంటుతో మాత్రమే తాము చర్చలు జరుపుతామని చెప్పారు.

**'భూభాగాన్ని ఆక్రమిస్తూనే ఉన్నాం'**

అయితే ఉక్రెయిన్ అధ్యక్ష ఎన్నికలు ఈ ఏడాదికి వాయిదా పడ్డాయని తెలిపారు. జెలెన్స్కీని తాము చట్టబద్ధ అధ్యక్షుడిగా చూడటం లేదని అన్నారు. గురువారం పుతిన్ నాలుగున్నర గంటల పాటు సాగిన వార్షిక విలేకరుల సమావేశంలో వివిధ ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. ఉక్రెయిన్‌తో యుద్ధంలో తాము విజయానికి చేరువలో ఉన్నామని తెలిపారు. తమ దళాలు రోజుకొక చదరపు కిలోమీటర్ భూభాగాన్ని ఆక్రమిస్తూనే ఉన్నామని పుతిన్ చెప్పారు. తాము చేపట్టిన ప్రత్యేక సైనిక ఆపరేషన్ విజయవంతమవుతోందని అన్నారు.

**'ట్రంప్‌ను కలవడానికి నేను సిద్ధం'**

మరోవైపు, అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్‌తో నాలుగేళ్లుగా తాను మాట్లాడలేదని అయితే ఆయన్ను కలవడానికి తాను సిద్ధంగా ఉన్నానని పుతిన్ చెప్పారు. అంతకుముందు అగ్రరాజ్యానికి కాబోయే అధ్యక్షుడిపై రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసలు కురిపించారు. ఆయన తెలివైన రాజకీయ నేత అని అన్నారు. అయితే, ఇటీవల ఆయనపై జరిగిన హత్యాయత్నాలు దిగ్భ్రాంతి కలిగించాయన్న పుతిన్, ప్రస్తుతం ట్రంప్ ప్రాణాలకు రక్షణ లేదంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా ఎన్నికల ప్రచారంలో జరిగిన ఘటనలను గుర్తుచేసుకున్నారు."అమెరికా ఎన్నికల్లో ట్రంప్‌పై పోరాడేందుకు కొందరు అనాగరిక పద్ధతులు పాటించారు. ఆయన కుటుంబాన్ని, పిల్లలను లక్ష్యంగా చేసుకొని రాజకీయ ప్రత్యర్థులు విమర్శలు గుప్పించడం దిగ్భ్రాంతి కలిగించింది. ఒకటికంటే ఎక్కువసార్లు ఆయనపై హత్యాయత్నాలు జరగడం విచారకరం. నా ఆలోచన ప్రకారం ఇప్పుడు ట్రంప్ ఏమాత్రం సురక్షితంగా లేరు. అయితే ఆయన తెలివైన వ్యక్తి. ముప్పును అర్థం చేసుకొని జాగ్రత్తగా ఉంటారని విశ్వసిస్తున్నా" అని పుతిన్ తెలిపారు.



## హైకోర్టులో కేటీఆర్ లంచ్ మోషన్ పిటిషన్

హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:

బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీ రామారావు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఫార్ములా ఈ రేసు వ్యవహారంలో ఏసీబీ కేటీఆర్‌పైన కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉన్నత న్యాయస్థానంలో కేటీఆర్ క్వాష్ పిటిషన్ వేశారు. భోజన విరామం తర్వాత ఈ కేసుపై విచారణ చేపట్టాలని ఆయన కోరారు.


బీఆర్ఎస్ హయాంలో పురపాలక శాఖ మంత్రిగా వ్యవహరించిన కేటీఆర్‌ను ప్రధాన నిందితుడు ఏ1గా పేర్కొంటూ తెలంగాణ ఏసీబీ గురువారం కేసు నమోదు చేయగా, అప్పటి పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్విందు కుమార్ ఏ2గా, అప్పటి హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎస్ఎన్ రెడ్డి ఏ3గా ఎఫ్ఐఆర్‌లో చేర్చింది.

'నేను ఏ తప్పు చేయలేదు భయపడేది లేదు న్యాయపరంగా ఏం చేయాలో అది చేస్తాం : కేటీఆర్

**గవర్నర్ అనుమతి :** ఫార్ములా ఈరేసు నిర్వహించడం కోసం నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థకు డబ్బు చెల్లించారంటూ పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ ఏసీబీ ఈ ఏడాది అక్టోబరు 18న ఫిర్యాదు చేశారు. ఈ కారణంగా ప్రభుత్వానికి రూ.54.88 కోట్ల మేర నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. అయితే కేటీఆర్ మంత్రిగా వ్యవహరించిన సమయంలో ఇది చోటుచేసుకోవడంతో కేసు నమోదుకు ప్రభుత్వం గవర్నర్ అనుమతి కోరింది. కాగా గవర్నర్ ఆమోదించడంతో ఈ నెల 17న సాధారణ పరిపాలనశాఖ మెమో జారీ చేయగా ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ డీఎస్పీ మాజిద్ అలీఖాన్ గురువారం కేసు నమోదు చేశారు.

# ఉభయ సభలు నిరవధిక వాయిదా

ఇంటర్నెట్ డెస్క్ ,తెలంగాణ ముచ్చట్లు



పార్లమెంట్ ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. నవంబర్ 25న ప్రారంభమైన పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబరు 20తో ముగిశాయి. అదానీ అంశం, అంబేద్కర్‌పై వ్యాఖ్యలు తదితర అంశాలతో పార్లమెంట్ ఉభయ సభలు శీతాకాల సమావేశాల్లో అట్టుడికిపోయాయి.

**లోక్‌సభ నిరవధిక వాయిదా**

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అవమాన పరిచారంటూ ఇండియా కూటమి నేతలు శీతాకాల సమావేశాల చివరి రోజైన శుక్రవారం నిరసన చేపట్టారు. విపక్ష నేతల నిరసనకు పోటాపోటీగా ఎన్‌డీఏ ఎంపీలు సైతం ప్లకార్డులతో ఆందోళనకు దిగారు. దీంతో సభ్యుల తీరుపై అసహనం వ్యక్తం చేసిన లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

**రాజ్యసభ నిరవధిక వాయిదా**

విపక్షాల నిరసనల మధ్యే శుక్రవారం రాజ్యసభ సమావేశాన్ని మధ్యాహ్నం 12గంటలకు ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ వాయిదా చేశారు. సభలో ప్రతిష్టంభనను ముగించే ప్రయత్నంలో భాగంగా సభా నాయకుడు జేపీ నడ్డా, రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే సహా ప్రతిపక్ష పార్టీల నాయకులతో ధన్‌ఖడ్ భేటీ అయ్యారు. సభను సజావుగా సాగేలా చూడాలని వారిని కోరారు.

రాజ్యసభలో జమిలి ఎన్నికల తీర్మానం ఆమోదం రాజ్యసభ మధ్యాహ్నం 12 గంటలకు మళ్లీ ప్రారంభమైన తర్వాత జమిలి ఎన్నికలకు సంబంధించిన బిల్లును జేపీసీకి పంపేందుకు తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్‌ను జగ్‌దీప్ ధన్‌ఖడ్ కోరారు. ఈ తీర్మానం వాయిస్ ఓటుతో ఆమోదం పొందింది.

**'అర్థవంతమైన చర్చలు జరగాలి'**

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో రాజ్యసభ పని చేసింది కేవలం 43 గంటల 27 నిమిషాలేనని ఛైర్మన్ ధన్‌ఖడ్ తెలిపారు. పార్లమెంటేరియన్లుగా తాము దేశ ప్రజల నుంచి తీవ్రమైన విమర్శలను ఎదుర్కొంటున్నామని వ్యాఖ్యానించారు. సమావేశాల నిరంతర అంతరాయాలు దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజలకు విశ్వాసాన్ని క్రమంగా సన్నగిల్లేలా చేస్తున్నాయని అభిప్రాయపడ్డారు. అర్థవంతమైన చర్చ జరగాలని కోరుతూ సభను నిరవధిక వాయిదా వేశారు.

**జేపీసీకి జమిలి ఎన్నికల బిల్లు**

విపక్ష సభ్యుల నిరసన మధ్యే లోక్‌సభ శుక్రవారం సమావేశమైంది. జమిలి ఎన్నికల ముసాయిదాను జేపీసీకి పంపాలన్న తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్‌ను స్పీకర్ ఓం బిర్లా కోరారు. ఆ సమయంలో విపక్ష సభ్యులు 'జై భీమ్' 'జై భీమ్' అని నినాదాలు చేశారు. అయినప్పటికీ జమిలి ఎన్నికల బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపిస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు. కాగా, విపక్షాల నినాదాల మధ్యే ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభ ఛాంబర్‌లోకి ప్రవేశించారు.

**సభ్యులకు స్పీకర్ హెచ్చరిక**

ఎంపీలు పార్లమెంటులో ప్రదర్శనలు, నిరసనలకు దిగితే చర్యలు తప్పవని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా శుక్రవారం హెచ్చరించారు. అంబేద్కర్‌ను కేంద్ర హోం మంత్రి అమిత్ షా అవమానించారంటూ పార్లమెంటు ఆవరణలో అధికార, విపక్ష సభ్యులు పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతున్న నేపథ్యంలో ఓం బిర్లా ఈ వ్యాఖ్యలు చేశారు.

"పార్లమెంట్ ఆవరణలో ఎక్కడైనా ప్రదర్శనలు లేదా నిరసనలు చేయొద్దు. అలా చేస్తే ఎంపీలపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. పార్లమెంటు గేట్ల వద్ద ఎలాంటి నిరసనలు లేదా ప్రదర్శనలు నిర్వహించడం సరికాదు. ఈ విషయంలో మీరు నిబంధనలను పాటించాలి. ఈ హెచ్చరికను సీరియస్‌గా తీసుకోవాలని నేను మిమ్మల్ని మరోసారి కోరుతున్నాను" అని స్పీకర్ ఓం బిర్లా లోక్ సభ నిరవధిక వాయిదాకు ముందు వ్యాఖ్యానించారు.

**విపక్షాల ర్యాలీ**

దిల్లీలోని విజయ్ చౌక్ వద్ద ప్రతిపక్ష ఇండియా కూటమి నేతలు ధర్నా చేపట్టారు. అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని నినాదాలు చేస్తూ విజయ్ చౌక్ నుంచి పార్లమెంట్ వరకు ర్యాలీగా వచ్చి తమ నిరసనను తెలిపారు. ఈ క్రమంలో బీజేపీ సర్కార్‌పై ప్రియాంక విమర్శలు గుప్పించారు. రాహుల్ గాంధీపై కేసులు పెట్టడం బీజేపీ నైరాశ్యాన్ని తెలియజేస్తుందని ఎద్దేవా చేశారు.



## నా కెరీర్‌లో ఎక్కువ కష్టపడింది ఆ రోల్ కోసమే

ప్రతినాయక పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు నటుడు సోనూసూద్ . త్వరలోనే తన దర్శకత్వ ప్రతిభను చాటబోతున్నారు. ఆయన డైరెక్షన్‌లో రూపొందిన తొలి సినిమా 'ఫతేహ్' 2025 జనవరి 10న విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా సోనూసూద్ ప్రత్యేక ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. తన కెరీర్‌లో ది బెస్ట్‌గా నిలిచిన 'అరుంధతి' , 'జోధా అక్బర్' సినిమాల చిత్రీకరణ జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. ఆ సంగతులు ఆయన మాటల్లోనే."నా కెరీర్‌లో నేను బాగా కష్టపడిన పాత్రే కాదు ఎంతో ప్రత్యేకం 'అరుంధతి'లోని పశుపతి. మేకప్‌కే ఆరేడు గంటల సమయం పట్టేది. మేకప్ వల్ల దద్దుర్లు వచ్చాయి. పగలు, రాత్రి నిరంతరాయంగా చిత్రీకరణ జరిగింది. షూటింగ్ మొత్తం పూర్తయ్యాక డైరెక్టర్ నుంచి ఎప్పుడు ఫోన్ కాల్ వచ్చినా మళ్లీ యాక్ట్ చేయమంటారేమోనని భయపడేవాడిని (నవ్వుతూ). సినిమా విడుదల తర్వాత ముంబయి నుంచి మళ్లీ హైదరాబాద్ వచ్చా. థియేటర్ల వద్ద ప్రేక్షకుల రద్దీ చూసి ఆశ్చర్యపోయా. సినిమా నచ్చితే తెలుగు ప్రేక్షకులు ఎంతగా ఆదరిస్తారో అప్పుడర్థమైంది. అదంతా జరిగి అప్పుడే 15 ఏళ్లు గడిచాయంటే నమ్మలేకపోతున్నా" అని పేర్కొన్నారు.బాలీవుడ్ మూవీ 'జోధా అక్బర్' సంగతులూ గుర్తు చేసుకుంటూ.. "ఆ సినిమా ప్రారంభంలో.. ఓ సన్నివేశం చిత్రీకరిస్తుండగా ఐశ్వర్యారాయ్ సడెన్‌గా.. 'నిన్ను చూస్తుంటే మా 'పా' (అమితాబ్ బచ్చన్) గుర్తొస్తున్నారని చెప్పింది. ఆమె బెస్ట్ కో-స్టార్. బచ్చన్ కుటుంబంతో నాకు మంచి అనుబంధం ఉంది. అమితాబ్, అభిషేక్ బచ్చన్‌లతోనూ నేను కలిసి నటించా" అని అన్నారు. ఏ జానర్ సినిమాలు ఇష్టమని అడగ్గా.. యాక్షన్ కామెడీ అని సోనూసూద్ సమాధానమిచ్చారు.యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిన 'ఫతేహ్'లో ఆయనే హీరో. జాక్వెలిన్ ఫెర్నాండెజ్ హీరోయిన్. సైబర్ మాఫియా కథ ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని జీ స్టూడియోస్, శక్తి సాగర్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.



## 100 ఏళ్ల బాలీవుడ్ హిస్టరీలో.. 'పుష్ప 2' రికార్డు..

విడుదలకు ముందు నుంచే సరికొత్త రికార్డులు సృష్టించి, రిలీజ్ తర్వాత అంతకుమించి జోరు ప్రదర్శిస్తోంది 'పుష్ప 2' ఇప్పటికే పలు రికార్డులతో హవా కొనసాగిస్తున్న ఆ చిత్రం తాజాగా మరో అరుదైన ఫీట్ సాధించింది. హిందీ బాక్సాఫీసు వద్ద అత్యధిక వసూళ్లు (నెట్) సాధించిన సినిమాగా నిలిచింది. రూ.632 కోట్లు కలెక్ట్ చేసి 100 ఏళ్ల బాలీవుడ్ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. విడుదలైన 15 రోజుల్లోనే ఆ మొత్తాన్ని వసూలు చేయడం మరో విశేషం. ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమా 14 రోజుల్లో రూ.1508 కోట్లు (గ్రాస్) వసూలు చేసింది.విడుదలైన 6 రోజుల్లోనే ఈ సినిమా రూ.1000 కోట్ల గ్రాస్ వసూలు చేసి భారతీయ సినీ చరిత్రలో నయా రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే. ఇప్పటి వరకూ 'కేజీయఫ్2' (రూ.1250 కోట్లు), 'ఆర్‌ఆర్‌ఆర్' (రూ.1,387 కోట్లు) ఆల్‌టైమ్ కలెక్షన్లు దాటేసిన 'పుష్ప2'.. 'బాహుబలి2' (రూ.1810 కోట్లు) వసూళ్లను దాటే దిశగా దూసుకెళ్తోంది.ప్రేక్షకులకు మరింత వినోదాన్ని పంచేందుకు చిత్ర బృందం మరికొన్ని సన్నివేశాలు జత చేయనుందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆయా సీన్ల రన్‌టైమ్ దాదాపు 20 నిమిషాలు ఉండనుందని సమాచారం. ఇప్పటికే ఈ సినిమా నిడివి సుమారు 3 గంటల 20 నిమిషాలున్న సంగతి తెలిసిందే.

# sports స్పోర్ట్స్



## సొంతగడ్డలో వెస్టిండీస్‌కు ఘోర అవమానం..

వెస్టిండీస్ పర్యటనలో భాగంగా బంగ్లాదేశ్ టీ20 సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసింది. మూడో టీ20లో ఆతిథ్య జట్టును 80 పరుగుల తేడాతో ఓడించి ఈ ఘనత సాధించింది. ముందుగా జరిగిన తొలి టీ20లో బంగ్లాదేశ్ 7 పరుగుల తేడాతో విజయం సాధించింది. తర్వాతి రెండో టీ20లో బంగ్లాదేశ్ 27 పరుగుల తేడాతో గెలిచింది. మూడో టీ20లో బంగ్లాదేశ్ వెస్టిండీస్‌కు 190 పరుగుల విజయలక్ష్యాన్ని నిర్దేశించింది. అయితే, వెస్టిండీస్ 109 పరుగులకు మించి స్కోరు చేయలేకపోయింది. 17వ ఓవర్‌లోనే వారి ఇన్నింగ్స్ ముగిసింది. దీంతో, విదేశాల్లో ఆడిన టీ20 సిరీస్‌ను బంగ్లాదేశ్ తొలిసారి క్లీన్ స్వీప్ చేసింది.మూడో టీ20లో బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 189 పరుగులు చేసింది. బంగ్లాదేశ్ బ్యాటింగ్ లో జకీర్ అలీ 41 బంతుల్లో 6 సిక్సర్లతో అజేయంగా 72 పరుగులు చేశాడు. దీనితో బంగ్లాదేశ్ కు భారీ విజయం దక్కింది. 190 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో, వెస్టిండీస్ జట్టు మొదటి నుంచి దారుణమైన పరిస్థితిలో చిక్కుకుంది. బంగ్లాదేశ్ జట్టు సగం వికెట్లను కేవలం 46 పరుగులకే కోల్పోయింది. ఆ తర్వాత కూడా ఏ దశలో పుంజుకోలేకపోయిన వెస్టిండీస్ జట్టు మొత్తం 16.4 ఓవర్లలో 109 పరుగులకే ఆలౌట్ అయింది. దింతో సొంతగడ్డలో వెస్టిండీస్‌కు ఘోర అవమానం జరిగినట్లైంది. ఇక ఈ పర్యటనలో మొదట రెండు టెస్టులలో చిరు జట్టు విజయం సాధించగా.. వన్డేలలో 3 – 0తో వెస్టిండీస్ బంగ్లాదేశ్ ను క్లీన్ స్వీప్ చేసింది. దీంతో ఇప్పుడు బంగ్లాదేశ్ వెస్టిండీస్ పై ప్రతీకారం తీర్చుకున్నట్లుగా ఉంది.



## 'పృథ్వీ షా ఉన్నా లేనట్లే.. 10 మంది ఫీల్డర్లతో ఆడాం'

పృథ్వీ షా ను విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్‌లకు ఎంపిక చేయకపోవడంపై ముంబయి క్రికెట్ అసోసియేషన్ స్పందించింది. అతని ఫిట్‌నెస్, క్రమశిక్షణ, ప్రవర్తన బాగా లేకపోవడమే ఇందుకు కారణమని ఎంసీఏ అధికారి ఒకరు తెలిపారు. 'ముగిసిన సయ్యద్ ముస్తాక్ అలీట్రోఫీలో 10 మంది ఫీల్డర్లతో ఆడాం. పృథ్వీ షా మైదానంలో ఉన్నా లేనట్లే. బంతి అతని పక్కనుంచి వెళ్లినా దాన్ని పట్టుకోలేడు. బ్యాటింగ్ చేస్తున్నప్పుడు కూడా సరైన సమయంలో బంతిని హిట్ చేయడంలో ఇబ్బందిపడటం చూశాం. అతని ఫిట్‌నెస్, క్రమశిక్షణ, ప్రవర్తన కూడా బాగా లేవు. టీమ్‌లోని సీనియర్లు కూడా ఇప్పుడు అతని వైఖరిపై ఫిర్యాదు చేయడం ప్రారంభించారు. సోషల్ మీడియాలో ఇలాంటి పోస్టులు పెడితే అవి ముంబయి సెలక్టర్లు, ఎంసీఏపై ప్రభావం చూపిస్తాయని అనుకోవడం తప్పు. పృథ్వీ షా ఫిట్‌నెస్ విషయంలో జాగ్రత్తగా ఉండటం లేదు. పృథ్వీకి శత్రువులెవరూ లేరు. తనకి తానే శత్రువు' అని ఎంసీఏ అధికారి పేర్కొన్నారు.విజయ్ హజారే ట్రోఫీ విషయంలో భంగపాటు ఎదురవడంతో పృథ్వీ షా ఇన్‌స్టా స్టోరీలో ఓ పోస్టు పెట్టాడు. "చెప్పు దేవుడా.. నేనింకా ఏమేం చూడాలి? విజయ్ హజారే ట్రోఫీలో 65 ఇన్నింగ్స్‌లలో 55.7 సగటు, 126 స్ట్రైక్ రేటుతో 3,399 పరుగులు చేసినా టోర్నీ ఆడేందుకు అర్హుడిని కానా? అయినా నీపై నా నమ్మకాన్ని వీడను. ఇప్పటికీ ప్రజలు నాపై విశ్వాసంతో ఉన్నారని భావిస్తున్నా. కచ్చితంగా తిరిగొస్తా. ఓం సాయిరాం" అని ఆ పోస్టులో పేర్కొన్నాడు. ఈ నేపథ్యంలోనే ఎంసీఏ వర్గాలు తాజాగా స్పందించాయి.ఇటీవల సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ముంబయి ఛాంపియన్‌గా నిలిచింది. అయితే, పృథ్వీ షా అందులో పెద్దగా రాణించలేదు. 9 మ్యాచ్‌ల్లో 197 పరుగులు మాత్రమే చేశాడు. మధ్యప్రదేశ్‌తో జరిగిన ఫైనల్‌లో 10 పరుగులకే పెవిలియన్ చేరాడు. దీంతో విజయ్ హజారే ట్రోఫీకి అతడిని ఎంపిక చేయలేదు. ఫిట్‌నెస్, క్రమశిక్షణ కారణాలతో రంజీ ట్రోఫీ లీగ్ దశ మధ్యలోనే పృథ్వీని జట్టు నుంచి తొలగించిన విషయం తెలిసిందే. నవంబరులో జరిగిన ఐపీఎల్ వేలంలో పృథ్వీని ఏ ఫ్రాంచైజీ కొనుగోలు చేయకపోవడంతో అన్‌సోల్డ్‌గా మిగిలాడు.


Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2013/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in